మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

దినపత్రిక
# నేటి ఈవార్తలు
Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 13-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 195 Issue: 195

మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:53 సూర్యాస్తమయం - సా. 5:56 తిథి దశమి మ. 3:18 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం విశాఖ రా. 11:59 వరకు తరువాత అనురాధ యోగం శూల రా. 7:01 వరకు కరణం విష్టి మ. 3:18 వరకు బవ తె. 4:360 వరకు వర్జ్యం తె. 4:36 నుండి ఉ. 6:24 వరకు దుర్ముహూర్తం ఉ. 9:05 నుండి ఉ. 9:50 వరకు రా. 11:07 నుండి రా. 11:58 వరకు రాహుకాలం మ. 3:10 నుండి సా. 4:33 వరకు యమగండం ఉ. 9:38 నుండి ఉ. 11:01 వరకు గుళికాకాలం మ. 12:24 నుండి మ. 1:47 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:17 నుండి ఉ. 6:05 వరకు అమృత ఘడియలు మ. 2:15 నుండి సా. 4:03 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:02 నుండి మ. 12:46 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున




## జిల్లాలు మారుస్తం

తెలంగాణలో జిల్లాల పునర్విభజనపై సీఎం రేవంత్ కీలక ప్రకటన చేశారు. త్వరలో ఈ అంశంపై కమిటీ ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. 'జిల్లాల సరిహద్దులు మార్చాలని ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. అందుకే జిల్లాల పునర్విభజన కోసం ఒక రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయనున్నాం. ఈ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. జిల్లాల పునర్విభజనపై అసెంబ్లీలో చర్చ జరిపి, సభ్యుల సలహాలు తీసుకున్నాకే తుది నిర్ణయం తీసుకుంటాం. ఈ అంశంపై అపోహలు పెట్టుకోవద్దని ప్రజల కు విజ్ఞప్తి చేశారు. ముం దుగా మండలాల రేషనలై జేషన్, తర్వాత రెవెన్యూ డివిజన్ల రేషనలైజేషన్, ఆ తర్వాతే జిల్లాల పునర్విభజన జరుగుతుంది' అని తెలిపారు.

# వెహికల్.. బ్యాంక్ అకౌంట్ లింక్!

### రిజిస్ట్రేషన్ సమయంలోనే లింక్ చేయాలి

**చలాన్లు పడితే వెంటనే డబ్బు కట్ కావాలి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

వాహనాలకు చలాన్లు విధిస్తున్నప్పటికీ, డిస్కౌంట్ ఇచ్చి తగ్గిస్తారనే భావన ఒక పెద్ద సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇకపై ట్రాఫిక్ చలాన్లకు ఎలాంటి డిస్కౌంట్ ఇవ్వరాదని ఆయన సూచించారు. ఏ వాహనమైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే, యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా డబ్బులు కట్ అయ్యే విధానం రావాలని ఆయన అభిప్రాయపడ్డారు.

2



# చలాన్‌తో చిల్లు!

### వ్యక్తిగత ఆస్తిపై సర్కారు నిఘా?.. రాంగ్ చలాన్ వేస్తే పరిస్థితి ఏంటి?

### రోడ్లపై గుంతల సంగతి ఏంటి?.. రేవంత్ చలాన్ వ్యాఖ్యలపై విమర్శలు

సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన ఆటోమేటిక్ చలాన్ రికవరీ సిస్టమ్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారం రేపుతోంది. నిబంధనల ఉల్లంఘన జరగగానే బ్యాంకు ఖాతాల నుంచి నగదు మినహాయించుకోవడం అనేది రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

హైదరాబాద్, జనవరి 12 (ఈవార్తలు): ట్రాఫిక్ క్రమశిక్షణ అవసరమే కానీ, అది ప్రజలను భయపెట్టేలా ఉండకూడదు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోకపోతే, రోడ్ల మీద ట్రాఫిక్ కంటే కూడా ప్రజల్లో ఆగ్రహం ఎక్కువగా పెరిగే అవకాశం కనిపిస్తోంది.

1. వ్యక్తిగత గోప్యతకు భంగం: ప్రభుత్వం ప్రజల బ్యాంకు ఖాతాలను నేరుగా యాక్సెస్ చేయడం అంటే, పౌరుల ఆర్థిక లావాదేవీలపై నిఘా ఉంచడమేనని నిపుణులు తరువాయి 2 వ పేజీలో...

## 18న మేడారంలో కేబినెట్ భేటీ?

జాతర ఏర్పాట్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించే యోచన

బడ్జెట్ సమావేశాలు, ఆర్థిక పరిస్థితిపై చర్చ

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంకేతం

2

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,215 |
| వెండి (గ్రాము): | రూ.287 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,809 |

## విశ్వవాణి



స్మార్ట్ ఫోన్‌తో అధికంగా గడిపే 13 ఏళ్ల లోపు పిల్లల్లో భవిష్యత్తులో మానసిక ఆరోగ్య సమస్యలు అధికం అవుతాయని తాజా అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా యువతుల్లో ఈ ప్రమాద స్థాయి అధికంగా ఉందని వెల్లడైంది. దాదాపు లక్ష మంది యువతుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించగా, వారిలో స్మార్ట్ ఫోన్‌తో అధికంగా గడిపిన వాళ్లలో ఆత్మహత్య సంబంధిత ఆలోచనలు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది.




# అగ్గి పుట్టిస్తం!

### జిల్లాల జోలికొస్తే ఉద్యమమే.. రేవంత్ సర్కారుకు కేటీఆర్ వార్నింగ్

కేసీఆర్ హయాంలో అశాస్త్రీయంగా జిల్లాల విభజన జరిగిందని, తాము జిల్లాలను కుదిస్తామని, కొన్ని జిల్లాలను తొలగిస్తామని ఇటీవల అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. జిల్లాలను ముట్టుకుంటే అగ్గిపుడుతదని, ఆ అగ్గిని పుట్టించే బాధ్యత బీఆర్ఎస్ పార్టీయే తీసుకుంటదని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

మహబూబ్‌నగర్, జనవరి 12 (ఈవార్తలు): మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ఈ హెచ్చరిక చేశారు. 'మొన్న అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి చెప్తున్నడు. కేసీఆర్ ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాల విభజన చేసిందట. కేసీఆర్‌గారు ప్రజలకు పాలనను చేరువచేసేందుకు రాష్ట్రంలోని 10 జిల్లాలను 31 జిల్లాలకు పెంచారు. మహబూబ్‌నగర్ జిల్లాను మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల్, వనపర్తి జిల్లాలుగా విభజించారు. తండాల పాలనను తండా వాసుల చేతుల్లోనే పెట్టేందుకు వాటిని గ్రామ పంచాయతీలుగా మార్చారు' అని చెప్పారు. 'ఇప్పుడు కాంగ్రెసోళ్లు ఏమంటున్నరు..? మహబూబ్‌నగర్‌ను ఐదు ముక్కలు చేసేది లేకుండెనట. తండాలను



# ఉద్యోగులకు డీఏ

### సంక్రాంతి వేళ సర్కారు గుడ్ న్యూస్

### మీడియాతో సీఎం రేవంత్ వెల్లడి

ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం రేవంత్ సంక్రాంతి కానుక ప్రకటించారు. ఉద్యోగులకు మరో డీఏ ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ ప్రకటన చేశారు. డీఏ ఫైల్ మీద సంతకం చేసి వచ్చా. రేపో మాపో డీఏ జీవో వస్తుంది'అని తెలిపారు. అటు.. తెలంగాణ ప్రభుత్వం పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంపు ప్రకటించింది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది మంది పెన్షనర్లకు ఉపశమనం కలగనుంది. ప్రస్తుతం అమలులో ఉన్న 30.03శాతం డీఆర్‌ను 33.67శాతానికి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్, జనవరి 12 (ఈవార్తలు): ఈ పెంపు 2018 జూలై 1 తర్వాత రిటైర్డ్ అయిన పెన్షనర్లకు వర్తించనుంది. 2020 రివైజ్డ్ పే స్కేల్స్ ప్రకారం పెన్షన్ పొందుతున్న వారికి ఇది ప్రత్యక్ష లాభం కలిగిస్తుంది. 2018కి ముందు రిటైర్డ్ అయిన పెన్షనర్లకు కూడా డీఆర్ పెంపు వర్తించనుంది. 2015 పే స్కేల్స్ ప్రకారం పెన్షన్ పొందుతున్న వారికి డీఆర్ 68.628శాతం నుంచి 73.344 శాతానికి పెరిగింది. 2016 పే స్కేల్స్ పెన్షనర్లకు డీఆర్ 42శాతం నుంచి 46శాతానికి పెంపు జరిగింది. యూజీసీ/ఏఐసీటీఈ 2006 పే స్కేల్స్ ప్రకారం పెన్షన్ పొందుతున్న వారికి డీఆర్ 221శాతం నుంచి 230శాతానికి పెరిగింది. ఈ పెంపు విద్యా రంగానికి చెందిన పెన్షనర్లకు గణనీయమైన లాభం కలిగించనుంది. పెరిగిన డీఆర్ 2023 జూలై 1 నుంచి అమలులోకి వస్తుంది. 2023 జూలై నుంచి 2025 డిసెంబర్ వరకు పెరిగిన డీఆర్ బకాయిలు చెల్లించనున్నారు. ఈ బకాయిలు మొత్తం 30 నెలవారీ వాయిదాల్లో చెల్లించబడతాయి. 2026 జనవరి నెల పెన్షన్‌తో పెరిగిన డీఆర్ చెల్లింపులు ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 2026లో పెన్షన్ మరియు డీఆర్ చెల్లింపులు పూర్తిగా అమలులోకి వస్తాయి. ఈ పెంపు ఫైనాన్షియల్ అసిస్టెన్స్ గ్రాంట్స్ పొందుతున్న వారికి వర్తించదు. కేవలం పెన్షన్ పొందుతున్న వారికి మాత్రమే ఈ లాభం అందుతుంది.



# మన జెన్‌జీలు.. క్రియేటర్లు

### ప్రధాని మోదీ ప్రశంసలు.. 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ ముగింపు

మన జనరేషన్-జెడ్ తరం సృజనాత్మకతతో నిండి ఉందని ప్రధాని మోదీ అన్నారు. వినూత్న ఆలోచనలు, లక్ష్యాలు, ఉత్సాహంతో దేశ నిర్మాణంలో ముందువరుసలో ఉందని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

న్యూఢిల్లీ: దేశ విదేశాల నుంచి వచ్చిన యువతతో ముచ్చటించారు. వివేకానందుడి జీవితం, బోధనల నుంచి స్ఫూర్తి పొంది.. 'వీబీవైఎల్‌డీ' వేదికను స్థాపించినట్లు చెప్పారు. 'యువత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టింది. ఈ క్రమంలోనే దేశంలో స్టార్టప్ విప్లవం ఊపందుకుంది. నూతన ఆలోచనలు, సంకల్పంతో దేశ నిర్మాణంలో యువశక్తి ముందుంది. సంస్కృతి, కంటెంట్, సృజనాత్మకతపై ఆధారపడిన ఆరెంజ్



# వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడిని నేనే

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన పోస్ట్

అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పెనుదుమారం రేపారు. వెనిజులాలో నెలకొన్న అనిశ్చితి మధ్య ఏకంగా తనను తానే ఆ దేశానికి తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకుని ప్రపంచాన్ని ఆశ్చర్య పరిచారు.

వాషింగ్టన్: తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో వికీపీడియా పేజీని పోలి ఉన్న ఒక ఎడిటెడ్ స్క్రీన్‌షాట్‌ను పోస్ట్ చేస్తూ ఈ ప్రకటన చేశారు. ఆ ఫొటోలో 2026 జనవరి నుంచి వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టినట్లు ఉండటంతో ఇప్పుడిది ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. గత కొద్ది రోజులుగా వెనిజులాలో నాటకీయ పరిణామాలు

# ఈపీఎఫ్‌వో వేతన సీలింగ్ పెంపు?

### ప్రైవేటు ఉద్యోగులకు మోదీ సర్కార్ గుడ్ న్యూస్!



# రాశి ఫలాలు

13.1.2026

మేషం: కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులకు చేయవలసి వస్తుంది. దైవ సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలు కొంత మందకొడిగా సాగుతాయి.

వృషభం: దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి కావు. ఇంటా బయట కొందరి ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

మిధునం: బంధు మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. కొత్త విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. స్త్రీ సంబంధ వ్యవహారాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారస్తులకు అధికారులతో చిన్నపాటి వివాదాలు కలగుతాయి.

కర్కాటకం: కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. పాత బాకీలు వసూలు అవుతాయి. వృత్తి ఉద్యోగాల్లో మీ పనితీరుతో అందరిని ఆకట్టుకొంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. శత్రువులు కూడా మిత్రులుగా మారి సహాయ పడతారు. సమాజంలోకి కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

సింహం: వ్యాపారాలలో నూతన పెట్టుబడుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. ముఖ్యమైన పనులలో తొందరపాటు మంచిది కాదు. నిరుద్యోగులకు కొంత అనుకూలత వాతావరణం ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య: దైవ సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇంటా బయట పని ఒత్తిడి అధికమై సమయానికి నిద్రహారాలు ఉండవు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇతరులకు ధనపరంగా మాట ఇచ్చే విషయంలో కొంత ఆలోచించి ముందుకు సాగడం మంచిది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

తుల: వ్యాపార వ్యవహారాలు కొంత నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. నూతన కార్యక్రమాలు ప్రారంభించక పోవడం మంచిది. జీవిత భాగస్వామితో అకారణంగా మాటపట్టింపులు ఉంటాయి. సోదరులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఇంటా బయట మీ మాటకు విలువ తగ్గుతుంది.


వృశ్చికం: నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో చర్చలు అనుకుంలించవు. వృధా ఖర్చులు విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

ధనస్సు: వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల నుండి ఆశించిన ధన సహాయం అందుతుంది. వ్యాపారాలు విస్తరించి నూతన లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు అధికారుల అండదండలతో నూతన అవకాశాలు పొందుతారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

మకరం: నూతన ఋణ ప్రయత్నాలు చెయ్యకపోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ధన పరంగా ఒడిదుడుకులు అదికమౌతాయి. దీర్ఘకాలిక రుణాలు ఒత్తిడి కొంత పెరుగుతుంది.

కుంభం: ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. మిత్రుల నుండి ఆశించిన ధన సహాయం పొందుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. కుటుంబ సమస్యలు రాజీ చేసుకుంటారు. ఉద్యోగమున ఆశించిన మార్పులు ఉంటాయి.

మీనం: ఉద్యోగమున సహెూద్యోగులతో వివాదాలకు వెళ్ళకపోవడం మంచిది. వ్యాపారాల్లో నూతన విధానాలు అమలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంత మెరుగుపడుతుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. దూర ప్రయాణాలలో తొందరపాటు మంచిది.




# వెహికల్.. బ్యాంక్ అకౌంట్ లింక్!

**రిజిస్ట్రేషన్ సమయంలోనే లింక్ చేయాలి**

**చలాన్లు పడితే వెంటనే డబ్బు కట్ కావాలి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

యూసుఫ్‌గూడ/హైదరాబాద్, జనవరి 12 (ఈవార్తలు): వాహనాలకు చలాన్లు విధిస్తున్నప్పటికీ, డిస్కౌంట్ ఇచ్చి తగ్గిస్తారనే భావన ఒక పెద్ద సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇకపై ట్రాఫిక్ చలాన్లకు ఎలాంటి డిస్కౌంట్ ఇవ్వరాదని ఆయన సూచించారు. ఏ వాహనమైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే, యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా డబ్బులు కట్ అయ్యే విధానం రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో యూసఫ్‌గూడ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'అర్రైవ్ అలైవ్ల కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుంటే, ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా, వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే యజమాని బ్యాంకు ఖాతాను లింక్ చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మైనర్లు ప్రమాదాలకు గురైతే వారి తల్లిదండ్రులపై కేసులు పెట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల విషయంలో రవాణా శాఖ, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చాలా సందర్భాల్లో మన ప్రమేయం లేకున్నా, ఎదుటివారి తప్పుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. హైడ్రా, ఈగల్, సైబర్ క్రైమ్ విభాగాలను బలోపేతం చేసినట్లే, ట్రాఫిక్ నియంత్రణలోనూ పోలీస్ వ్యవస్థను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

# చలాన్‌తో చిల్లు!

**మొదటి పేజీ తరువాయి**

హెచ్చరిస్తున్నారు. 'ప్రభుత్వ పని కేవలం నిబంధనలు అమలు చేయడం మాత్రమే, కానీ ప్రతి పౌరుడి బ్యాంకు ఖాతాలోకి చొరబడటం డిజిటల్ నిఘా కిందకు వస్తుంది' అని సైబర్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

2. రాంగ్ చలాన్ల పరిస్థితి: ప్రస్తుతం ఉన్న సిస్టమ్‌లోనే అనేక లోపాలు ఉన్నాయి. ఒకరి వాహనం నంబర్ ప్లేట్ మరొకరికి రావడం, కెమెరా ఫోకస్ సరిగ్గా లేక తప్పుడు చలాన్లు పడటం మనం నిత్యం చూస్తున్నాం. సాధారణంగా చలాన్ పడితే అది తప్పని నిరూపించుకోవడానికి వాహనదారుడికి అవకాశం ఉంటుంది. కానీ నేరుగా డబ్బు కట్ అయితే, సామాన్యుడు ఆ తప్పును సరిదిద్దుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. అంటే చేసిన తప్పుకు కాకుండా, చేయని తప్పుకు శిక్ష అనుభవించాల్సి వస్తుందనే ఆవేదన వ్యక్తమవుతోంది.

3. ఆర్థిక క్రమశిక్షణపై దెబ్బ: చాలా మంది పేద ప్రజలు, కూలీలు, డెలివరీ బాయ్స్ తమ రోజువారీ అవసరాల కోసం లేదా మందుల ఖర్చుల కోసం బ్యాంకు ఖాతాల్లో కొద్దిపాటి సొమ్మును దాచుకుంటారు. ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఆ డబ్బు కట్ అయితే, వారి అత్యవసర అవసరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

4. చట్టపరమైన సవాళ్లు: బ్యాంకు ఖాతా అనేది ఒక వ్యక్తి వ్యక్తిగత ఆస్తి. కోర్టు ఆర్డర్ లేదా చట్టపరమైన నోటీసు లేకుండా ప్రభుత్వ సంస్థలు నేరుగా డబ్బును విత్‌డ్రా చేసుకోవడం చట్టబద్ధతపై న్యాయ నిపుణులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని కొందరు న్యాయవాదులు వాదిస్తున్నారు.

## మన జెన్‌జీలు.. క్రియేటర్లు

**మొదటి పేజీ తరువాయి**

ఎకానమీలో దేశం అద్భుతమైన వృద్ధిని సాధిస్తోంది. గత దశాబ్ద కాలంలో ప్రారంభించిన సంస్కరణల పరంపర.. ఇప్పుడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా మారింది. వీటన్నింటికీ కేంద్ర బిందువు యువతే' అని మోదీ పేర్కొన్నారు.

## 18న మేడారంలో కేబినెట్ భేటీ?

**ఏర్పాట్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించే యోచన**

**బడ్జెట్ సమావేశాలు, ఆర్థిక పరిస్థితిపై చర్చ**

**గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంకేతం**

మేడారం/ములుగు, జనవరి 12 (ఈవార్తలు): రాష్ట్ర మంత్రిమండలి సమావేశానికి సంబంధించి వినిపిస్తున్న తాజా సమాచారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈనెల 18వ తేదీన రాష్ట్ర కేబినెట్ భేటీ కానుంది. అయితే, ఈ సమావేశం నిర్వహణ వేదిక విషయంలో ప్రభుత్వం ఒక వినూత్న నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా సచివాలయంలో జరిగే ఈ అత్యున్నత స్థాయి సమావేశాన్ని, ఈసారి ములుగు జిల్లాలోని ప్రసిద్ధ గిరిజన క్షేత్రమైన మేడారంలో నిర్వహించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర త్వరలోనే ప్రారంభం కానున్న నేపథ్యంలో, అక్కడే మంత్రిమండలి సమావేశం నిర్వహించడం ద్వారా పండుగ ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించవచ్చని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలంగాణలో త్వరలో జరగనున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల తేదీలను ఖరారు చేయడంతో పాటు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి , వివిధ శాఖల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలపై మంత్రిమండలి సమగ్రంగా చర్చించనుంది. అలాగే, మేడారం జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, నిధుల విడుదల, భద్రతా ఏర్పాట్లపై ఈ భేటీలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో కేబినెట్ సమావేశం నిర్వహించడం ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే కాకుండా, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటిచెప్పాలని సర్కార్ యోచిస్తోంది.



## అగ్గి పుట్టిస్తం!

**మొదటి పేజీ తరువాయి**

గ్రామ పంచాయతీలు చేసేది లేకుండెనట. కేసీఆర్ తప్పు చేసిండట. ఇప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాలను రద్దు చేస్తరట. ఈ విషయాన్ని మొన్న రెవెన్యూ మంత్రి అసెంబ్లీలో ప్రకటించారు. జిల్లాలను శాస్త్రీయంగా విభజించలేదు కాబట్టి అన్నింటిని తీసేస్తాం అంటున్నరు. మరె జిల్లాలను తీసేస్తే నారాయణపేటోళ్లు ఊకుంటరా..? గద్వాలోళ్లు, వనపర్తోళ్లు ఊకుంటరా..? నేను రేవంత్‌రెడ్డికి ఒక్కటే హెచ్చరిక చేస్తున్నా. గద్వాల జిల్లాను ముట్టినా.. నారాయణపేట జిల్లాను ముట్టినా.. వనపర్తి జిల్లాను ముట్టినా.. అక్కడ అగ్గిపుడుతది. ఆ అగ్గిపుట్టించే బాధ్యత బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటది' అని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు. అదేవిధంగా 'జిల్లాల జోలికొస్తే అక్కడే ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరిస్తున్నా. పిచ్చిపిచ్చి పొరపాట్లు చేయకండి. ప్రజలు మీ అడ్డగోలు హామీలకు మోసపోయి అధికారం ఇచ్చిండ్రు. మీకు చేతనైతే ఇచ్చిన హామీలను నెరవేర్చండి' అని సవాల్ చేశారు.

## ఈపీఎఫ్‌వో వేతన సీలింగ్ పెంపు?

**ప్రైవేటు ఉద్యోగులకు మోదీ సర్కార్ గుడ్ న్యూస్!**

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రైవేటు ఉద్యోగులకు శుభవార్త వినిపించేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎంప్లాయిమెంట్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ తాజాగా ఒక కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా ఇందులో ఈపీఎఫ్‌వో వేతన సీలింగ్ విషయంలో బోర్డు ఒక నిర్ణయం తీసుకున్న అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వేతన సీలింగ్‌ను రూ. 15,000 నుంచి రూ. 25,000 లేదా రూ. 30,000 కి పెంచడంపైన కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారిక వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈపీఎఫ్‌వో వేతన సీలింగ్‌ను పెంచడానికి కార్మిక మంత్రిత్వ శాఖ కొత్త ప్రతిపాదనపై పనిచేస్తోందని ఓ ఆంగ్ల పత్రిక ఒక ప్రత్యేక కథనంలో తెలిపింది. ఇది సామాజిక భద్రతా కవరేజీని విస్తరిస్తుందని. లక్షలాది మంది జీతాలు పొందే ఉద్యోగుల పదవీ విరమణ పొదుపును పెంచుతుందని తన కథనంలో పేర్కొంది. బడ్జెట్ సిఫార్సులలో భాగంగా ఈ ప్రతిపాదనను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో వేతన పరిమితి పెంపును ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా బేసిక్ వేతనం, డీఏతో కలిపి గరిష్టంగా రూ.15,000 వరకే ఈపీఎఫ్ లెక్కిస్తారు. అంటే మీ వేతనం ఎంత ఉన్నా మీ ఈపీఎఫ్ మాత్రమం గరిష్టంగా రూ. 15 వేలకే లెక్కిస్తారు. ఈ లెక్కన ఉద్యోగి వేతనం లో 12 శాతం వాటా అంటే 1800 రూపాయలు, అలాగే యజమాని వాటా 12 శాతం వాటా అంటే 1800 రూపాయలు చొప్పున మొత్తం 3600 రూపాయలు ప్రతి నెల ఈపీఎఫ్ ఖాతాకు జమ అవుతాయి. వేతన సీలింగ్ ను రూ.15,000 నుంచి రూ. 25,000 లేదా రూ. 30,000 వరకూ పెంచడం ద్వారా ఈపీఎఫ్ఓ కాంట్రిబ్యూషన్ కూడా పెరుగుతుంది. ఈ మొత్తం 1800 రూపాయల నుంచి రూ. 3600 వరకూ పెరిగే అవకాశం ఉంటుంది. యాజమాన్య వాటాతో కలిపి ఈ లెక్కన నెలకు సుమారు రూ. 7200 వరకూ ఈపీఎఫ్ అకౌంటులో జమ అవుతాయి. అంటే మీ రిటైర్మంట్ సమయంలో మీ చేతిలో ఉన్న ఈపీఎఫ్ ఫండ్ రెండింతలు అవుతుంది. దీని వల్ల ఉద్యోగికి రిటైర్మెంట్ తర్వాత పెద్ద మొత్తంలో డబ్బు లభిస్తుంది. ఈపీఎఫ్ఓ అంతేకాదు రిటైర్మెంట్ అనంతరం పిల్లలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఆర్థిక భద్రత లభిస్తుంది. అయితే ఇది ప్రస్తుతం ప్రతిపాదనల దశలో ఉంది.



# వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడిని నేనే

**మొదటి పేజీ తరువాయి**

చోటుచేసుకుంటున్నాయి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టే నెపంతో అమెరికా బలగాలు ఇటీవల వెనిజులా రాజధాని కారకాస్‌పై మెరుపు దాడులు నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను అమెరికా సైన్యం అదుపులోకి తీసుకుని వాషింగ్టన్‌కు తరలించింది. ఈ పరిణామం లాటిన్ అమెరికా దేశాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. మదురో నిర్బంధం తర్వాత వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. ఆమె 90 రోజుల పాటు అధికారంలో ఉంటారని ఆ దేశ రక్షణ శాఖ ప్రకటించింది. వాస్తవానికి వెనిజులా విపక్ష నేత, నోబెల్ విజేత మరియా కొరినా మచాడోను అధ్యక్షురాలిగా ఎన్నుకుంటారని అందరూ భావించారు. కానీ ట్రంప్ ఆమె పట్ల విముఖత చూపడం గమనార్హం. మచాడోకు ప్రజల్లో తగినంత మద్దతు లేదని ఆయన బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే తానే వెనిజులా బాధ్యతలు చూస్తానన్నట్లుగా ట్రంప్ పోస్ట్ చేయడం కొత్త దౌత్య వివాదానికి దారితీసింది.

### షాకిస్తున్న ట్రంప్

ఒక దేశాధ్యక్షుడు మరో దేశానికి తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం దౌత్య చరిత్రలో అరుదైన విషయం. ఇది కేవలం ట్రంప్ మార్కు హాస్యాస్పద పోస్టా? లేక వెనిజులాను తన చెప్పుచేతల్లోకి తీసుకునేందుకు అమెరికా వేస్తున్న వ్యూహమా? అన్నది అర్థం కాక దౌత్యవేత్తలు తలలు పట్టుకుంటున్నారు. వెనిజులాలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే తన లక్ష్యమని ట్రంప్ చెబుతున్నప్పటికీ.. ఏకంగా దేశ అధికార పగ్గాలు తనవే అనడం చర్చనీయాంశంగా మారింది.



# నల్లమల సాగర్ పిటిషన్ బ్యాక్!

## విచారణకు అర్హత లేదన్న సుప్రీం కోర్టు.. పిటిషన్ ఉపసంహరించుకున్న టీజీ సర్కారు

న్యూఢిల్లీ: పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హత లేదని సుప్రీం స్పష్టం చేసింది. తెలంగాణ తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. పోలవరం ప్రాజెక్టును నల్లమల్ల సాగర్‌తో లింక్ చేయడం వల్ల తెలంగాణకు నష్టమని, గోదావరి నీటి కేటాయింపులు ఉల్లంఘన అవుతున్నాయని కోర్టుకు ఆయన వివరించారు. వాదనలు విన్న సుప్రీంకోర్టు... ఈ పిటిషన్ ను కొనసాగించలేమని, ఈ కేసుతో కర్ణాటక, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాలు కూడా ముడిపడి ఉన్నాయని వ్యాఖ్యానించింది. అందుకే, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు (మీడియేషన్ లేదా సివిల్ సూట్) ద్వారా పరిష్కారం కోరవచ్చని సూచించింది. దీంతో, తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నామని సుప్రీంకోర్టుకు సింఘ్వీ తెలిపారు. సివిల్ సూట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు.

**చంద్రబాబుకు రేవంత్ గిఫ్ట్: హరీశ్ రావు**

సంక్రాంతి పండుగ వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన రాజకీయ గురువు, ఏపీ మాజీ సీఎం చంద్రబాబుకు ఓ విలువైన బహుమతి ఇచ్చారని, అదే సుప్రీంకోర్టులో వేసిన బలహీనమైన రిట్ పిటిషన్ అని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం - నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఏపీకి పూర్తిస్థాయిలో సహకరిస్తోందని, రేవంత్ రెడ్డి నిజస్వరూపం, ద్రోహబుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలైందని ఆయన ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేసేలా ప్రాజెక్టులు కడుతుంటే, కాంగ్రెస్ సర్కారు కావాలనే విచారణకు అర్హత లేని పిటిషన్ వేసి చేతులు దులుపుకొందని విమర్శించారు. "గతంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వం రైతుల చేత రిట్ పిటిషన్లు వేయించి మరీ స్టే తెచ్చుకుంది. కానీ ఇక్కడి చేతకాని కాంగ్రెస్ సర్కారు మాత్రం తెలంగాణకు తీరని ద్రోహం చేస్తోంది. ఈ మాత్రం విషయం ప్రభుత్వ న్యాయవాది, ఎంపీ అభిషేక్ మను సింఘ్వీకి తెలియదా? కేవలం రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూటు బూటు వేసుకుని ఢిల్లీ వెళ్లారా?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ రాష్ట్ర నీటి హక్కులను ఏపీకి దారాదత్తం చేయడం చారిత్రక ద్రోహమని మండిపడ్డారు. రిట్ పిటిషన్ ఉ



పసంహరించుకుని, సివిల్ సూట్ ఫైల్ చేస్తామని చెప్పడం ఏపీకి ప్రాజెక్టు పనులు పూర్తి చేసుకోవడానికి గడువు ఇవ్వడమేనని హరీశ్ రావు ఆరోపించారు. సివిల్ సూట్‌లో ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినాల్సి ఉంటుందని, ఇది ఏళ్లు గడిచినా తేలని వ్యవహారమని అన్నారు. ఈలోగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తి చేసుకుని తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం-నల్లమల సాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం మొదటి నుంచీ ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తోందని హరీశ్ ఆరోపించారు. "ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపారు. సంతకం పెట్టనంటూనే పెట్టి తెలంగాణ నదీ జలాలకు మరణశాసనం రాశారు. కమిటీ వేయనంటూనే వేసి ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేశారు. ఇప్పుడు టెండర్ల ప్రక్రియ ముగిశాక కోర్టుకు వెళ్లి పరోక్షంగా ప్రాజెక్టుకు అంగీకారం తెలిపారు," అని విమర్శించారు. కేవలం తన గురుదక్షిణ కోసమే రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారని హరీశ్ రావు ఆక్షేపించారు. "పంచాయతీలు, న్యాయస్థానాలు వద్దని, కూర్చొని మాట్లాడుకుందాం అనడంలో అంతర్యం ఏమిటి? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పగించడమే ఆ చర్చల లక్ష్యమా?" అని నిలదీశారు. "తెలంగాణలోని కృష్ణా, గోదావరి నదులపై చంద్రబాబు, ఆంధ్రా ప్రభుత్వం అడ్డుకోని ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయా? అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డీ... నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు. రేవంత్ రెడ్డీ... నీ గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే తెలంగాణను సాధించిన బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. నీ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం పోరు చేస్తాం" అని హరీశ్ రావు స్పష్టం చేశారు.




## బోరబండలో యువతి దారుణ హత్య

బోరబండ/హైదరాబాద్, జనవరి 12 (ఈవార్తలు): హైదరాబాద్ లో వరుస హత్యలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే చోటుచేసుకున్న పలు ఘటనలతో నగరవాసులు భయంతో ఉన్న వేళ, తాజాగా బోరబండ ప్రాంతంలో జరిగిన ఓ యువతి హత్య మరింత కలకలం రేపింది. చిన్న అనుమానం ఓ యువతి ప్రాణాలు తీసేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతురాలిని ఖనీజ్ ఫాతిమాగా గుర్తించారు. ఆమె గతంలో బంజారాహిల్స్‌లోని ఓ పబ్‌లో పనిచేసే సమయంలో జహీర్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా స్నేహంగా మారింది. అయితే కొంతకాలం క్రితం యువతి ఉద్యోగం మారి ఊర్వశి బార్‌లో పని చేయడం ప్రారంభించింది. దీంతో ఇద్దరి మధ్య మాట్లాడటం తగ్గిపోయింది. ఈ పరిస్థితిని జహీర్ తప్పుగా అర్థం చేసుకున్నాడు. తనను ఉద్దేశపూర్వకంగా దూరం పెడుతోందని, నిర్లక్ష్యం చేస్తోందని అనుమానంతో లోపలే లోపల కుంగిపోయాడు. అదే సమయంలో ఆమెపై ద్వేషం పెరిగింది. మాట్లాడుకుందామని చెప్పి యువతిని కలవడానికి పిలిచిన జహీర్, ఆ మాటల మధ్యే ఆమెపై దాడి చేసి కిరాతకంగా హత్య చేశాడు. యువతి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా, విచారణ ప్రారంభించిన బోరబండ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఫోన్ కాల్ రికార్డుల ప్రకారం నిందితుడిని గుర్తించారు. ప్రస్తుతం అతడిని విచారిస్తూ హత్యకు గల పూర్తి కారణాలు, ఘటనకు సంబంధించిన ఇతర కోణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## రోశయ్య సతీమణి కన్నుమూత

అమీర్‌పేట/హైదరాబాద్, జనవరి 12 (ఈవార్తలు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సతీమణి శివలక్ష్మి (86) కన్నుమూశారు. వయోభారంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని అమీర్‌పేట నివాసంలో ఈరోజు ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలియడంతో రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ రాజకీయ పక్షాల నాయకులు, ప్రముఖులు ఆమె నివాసానికి చేరుకుని పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం తెలుపుతూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు

# తెలంగాణ జైళ్ల శాఖలో సమగ్ర సంస్కరణలు

## డిజిటల్, పునరావాసంలో గణనీయమైన పురోగతి.. డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా ఐపీఎస్

హైదరాబాద్, జనవరి 12 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖలో 2025 సంవత్సరంలో గణనీయమైన సంస్కరణలు, సాంకేతిక పురోగతి, ఖైదీల పునరావాసం మరియు సిబ్బంది సంక్షేమంలో స్పష్టమైన మార్పులు చోటు చేసుకున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ డా. సౌమ్య మిశ్రా ఐపీఎస్ తెలిపారు. తెలంగాణ జైళ్ల శాఖ వార్షిక నివేదిక వివరాలను సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెల్లడించారు. 2025లో మొత్తం జైలు ప్రవేశాలు 11.8 శాతం పెరిగాయని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలు (135.6%) మరియు మద్యం తాగి వాహనం నడిపిన కేసులు (152%) అత్యధికంగా పెరిగినట్లు పేర్కొన్నారు. అయితే విదేశీ ఖైదీల సంఖ్య తగ్గడం గమనార్హమన్నారు. కోర్టు ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పు చోటు చేసుకుందని, 2025లో 69.47 శాతం కేసులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించామని తెలిపారు. ఇది భద్రత, వ్యయం తగ్గింపుతో పాటు న్యాయప్రవేశాన్ని వేగవంతం చేసిందన్నారు. లీగల్ ఎయిడ్ వ్యవస్థ బలోపేతం అయిందని, రాష్ట్ర వ్యాప్తంగా 155 లీగల్ ఎయిడ్ అడ్వకేట్లు, 47 పారా లీగల్ వాలంటీర్లు సేవలందిస్తున్నారని తెలిపారు. జైల్ అదాలత్‌ల ద్వారా 985 మంది ఖైదీలు విడుదలయ్యారని పేర్కొన్నారు. అలాగే పేద ఖైదీలకు బెయిల్ సహాయం పథకం అమలులో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని స్పష్టం చేశారు. పునరావాసమే లక్ష్యంగా తెలంగాణ జైళ్ల శాఖ పనిచేస్తోందని, 2025లో 79 శాతం శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించామని తెలిపారు. జైలు పరిశ్రమల ద్వారా ఖైదీలు రూ.1.63 కోట్లకు పైగా వేతనాలు సంపాదించారని వివరించారు. వడ్డీ లేని రుణాలు ఖైదీలకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం



తెలంగాణ అని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా నివృత్తి డీ -అడిక్షన్ కేంద్రాలు, సెంటెన్స్ ప్లానింగ్ విధానం, వేస్ట్ టు వెల్త్, తేనెటీగల పెంపకం, పుష్పాల నుంచి అగరబత్తీల తయారీ వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో భాగంగా, ప్రతి ఖైదీకి తప్పనిసరి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, 2025లో 379 శస్త్ర చికిత్సలు, అనేక ప్రత్యేక చికిత్సలు, 13 మెడికల్ క్యాంపులు నిర్వహించామని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో 6,597 మంది ఖైదీలు పాల్గొన్నారు అన్నారు. సాంకేతిక ఆధునీకరణలో భాగంగా సీఐజేఎస్ 2.0 కింద రూ.2.5 కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, ఐటీ సెల్ ఏర్పాటు, స్వాగతం పోర్టల్, జైళ్ల వెబ్‌సైట్, ఈ-ఆఫీస్, బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ అమలులోకి తెచ్చామని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధిలో సిద్ధిపేట జిల్లా జైలు, కొత్త బ్యారక్స్ పూర్తి, హై సెక్యూరిటీ జైలు మరియు నేషనల్ ప్రిజన్ అకాడమీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. సిబ్బంది సంక్షేమానికి ఆరోగ్య బీమా, రుణాలు, జీతభత్యాల ప్యాకేజీలు, క్రీడా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ జైళ్ల శాఖకు ఖైదీల పునరావాసం, సమాజంలో తిరిగి కలపడంలో ఉత్తమ పనితీరుకు స్కోచ్ అవార్డు, అలాగే సెంట్రల్ ప్రిజన్ చెర్లపల్లి -- దేశంలోనే ఉత్తమ పరిశుభ్ర జైలుగా గోల్డ్ మెడల్ లభించిందని తెలిపారు. 7వ అఖిల భారత జైళ్ల డ్యూటీ మీట్‌లో తెలంగాణ అత్యధిక బంగారు పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుని విజేతగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారని గర్వంగా పేర్కొన్నారు. 'తెలంగాణ జైళ్ల శాఖ కేవలం కస్టడీకి పరిమితం కాకుండా, సంస్కరణలు, గౌరవం, సాంకేతికత, పునరావాసం అనే దిశగా ముందుకు సాగుతోంది' అని సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. కార్యక్రమంలో వై రాజేశ్ (ఇన్స్పెక్టర్ జనరల్ జైళ్ళశాఖ), ఎన్ మురళి బాబు (ఇన్స్పెక్టర్ జనరల్ జైళ్ళశాఖ), డాక్టర్ డీ శ్రీనివాస్ (డీఐజీ హైదరాబాద్ రేంజ్) ఎం సంపత్ (డీఐజీ వరంగల్ రేంజ్) పాల్గొన్నారు.

# మాట మార్చిన కోమటిరెడ్డి

హైదరాబాద్, జనవరి 12 (ఈవార్తలు): సినిమా టిక్కెట్ ధరల పెంపుపై తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సంధ్య థియేటర్ ఘటన అనంతరం టిక్కెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని తాను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన మాట వాస్తవమేనని ఆయన అన్నారు. ఆ తర్వాత అందరం కూర్చుని చర్చించి, ఆ నిర్ణయాన్ని సవరించామని తెలిపారు. టిక్కెట్ ధరలు పెంచవలసి వస్తే, 20 శాతం సినిమా కార్మికుల సంక్షేమానికి ఇవ్వాలనే షరతు విధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు కొన్ని సినిమాలకు టిక్కెట్ ధరలు పెంచుకునేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. అయితే, దీనిపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. నల్లగొండ, భువనగిరి జిల్లాలలో పర్యటిస్తున్న



సమయంలో ఒక సినిమా టిక్కెట్ ధరలను పెంచుతూ జీవో వచ్చిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో తాను మరో కార్యక్రమంలో ఉన్నానని వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఏ శాఖల వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకోరని, అందరినీ కలుపుకుని ముందుకు సాగుతారని ఆయన వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి రెండు రోజుల క్రితం చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. గతంలోనూ, ప్రస్తుతం సినిమా టిక్కెట్ ధరలు పెంచుకునేందుకు తాను ఎప్పుడూ అనుమతి ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. సినిమా పరిశ్రమ గురించి పట్టించుకోవడం మానివేశానని కూడా ఆయన వ్యాఖ్యానించారు. సంధ్య థియేటర్ ఘటన తర్వాత బెనిఫిట్ షోలు, సినిమా టిక్కెట్ ధరల పెంపుదల కోసం తన వద్దకు రావొద్దని చెబుతూనే ఉన్నానని ఆయన అన్నారు. దీంతో ఆయన వ్యాఖ్యలతో కొంతమేర గందరగోళం నెలకొంది. తాజాగా తన వివరణతో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వాతావరణాన్ని తేలికపరిచే ప్రయత్నం చేశారు.



## వర్గల్ నవోదయ విద్యార్థులకు బహుమతులు

**8 మంది ఎంపిక: పాఠశాల ప్రిన్సిపాల్ దాసి రాజేందర్**

**రేపు అర్జున్ మేఘ్వాల్ చేతుల మీదుగా స్వీకరణ**

హైదరాబాద్, జనవరి 12 (పీఐబీ): సిద్దిపేట జిల్లాలోని వర్గల్‌లో జవహర్ నవోదయ విద్యాలయకు చెందిన 8 మంది విద్యార్థులు ఈ నెల 15న న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో జరగనున్న కార్యక్రమంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ చేతుల మీదుగా బహుమతులు అందుకోనున్నారు. ఈ విషయాన్ని విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ తెలిపారు. 2025 ఫిబ్రవరిలో మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయలో 26వ జాతీయ యువ పార్లమెంట్ పోటీలో పాల్గొన్న సందర్భంగా అత్యుత్తమ ప్రదర్శనను ఇచ్చినందుకు ఈ ఎనిమిది మంది విద్యార్థినీవిద్యార్థులనూ ఎంపిక చేశారని ప్రిన్సిపల్ తెలియజేశారు.

**పోటీలో పాల్గొన్న విద్యార్థులు:**

కుమారి పి.వైష్ణవి- స్పీకర్, మాస్టర్ అభినవ్- ప్రతిపక్షనేత, కుమారి కె. వైశాలి- ఆర్థిక మంత్రి, మాస్టర్ బెన్హర్ పాల్- వ్యవసాయ శాఖ మంత్రి, మాస్టర్ రామ్ చరణ్- పర్యావరణ శాఖ మంత్రి, కుమారి పి. శ్రీమణి- ప్రతిపక్ష సభ్యురాలు, మాస్టర్ ఆదినాథ్- ప్రధానమంత్రి, కుమారి టి. నక్షత్ర - ప్రతిపక్ష సభ్యురాలు.

## రేవంత్ రాష్ట్ర హక్కులను కాపాడలేకపోతున్నారు: కవిత



పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ రాష్ట్ర హక్కును రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరిరక్షించలేకపోయిందని మరోసారి స్పష్టమైందని ఆమె అన్నారు. నీటి పంపకాల విషయంలో పొరుగు రాష్ట్రాలతో వివాదాలు వద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన న్యాయపోరాటంలో ప్రతిబింబించిందని ఆమె విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు, ప్రభుత్వ వైఖరి తెలంగాణ రాష్ట్రానికి దురదృష్టకరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుపై విచారణకు అర్హత లేని పిటిషన్ వేసి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రం హక్కులను నిర్వీర్యం చేసిందని ఆమె ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వంలోని ఇతర ముఖ్య నాయకులకు నీటి వనరులపై అవగాహన లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి న్యాయపోరాటం చేస్తుందని, తెలంగాణ హక్కుల పరిరక్షణ ధ్యేయంగా ఉద్యమిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

## సెలవు దొరుకుతలే: సీఎం

హైదరాబాద్, జనవరి 12 (ఈవార్తలు): తాను ఇప్పటివరకు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని, సెలవు తీసుకోవాలని అనుకున్నప్పటికీ ఏదో ఒక పని వచ్చిపడుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వ సారథులని, వారధులని పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యోగుల్లో కూడా తనను ఇష్టపడని వారు ఉండొచ్చని, తాను వచ్చిన తరువాత ఉద్యోగుల వేతనాలు ఎలా అందుతున్నాయో గమనించాలని అన్నారు. ఉద్యోగుల డీఏ ఫైళ్లపై సంతకం చేసి ఇక్కడికి వచ్చానని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.1 కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని ఆయన అన్నారు. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయని అన్నారు. పన్నులు పెంచాల్సిన అవసరం లేదని, సరిగా వసూలు చేస్తే చాలని వ్యాఖ్యానించారు. జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో జిల్లాల పునర్విభజన కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

## అసత్య ప్రచారాలు సరికాదు: శ్రీధర్ బాబు

హైదరాబాద్, జనవరి 12 (ఈవార్తలు): ప్రభుత్వంలోని పెద్దలు, ఐఏఎస్ అధికారులపై కొన్ని రోజుల కిందట మీడియాలో జరిగిన ప్రచారం సరికాదని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వంలో నిష్పక్షపాతంగా పనిచేస్తున్న అధికారులపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని మంత్రి మీడియాతో అన్నారు. ఇది మంచి సంస్కృతి కాదని, ఇలాంటి ప్రచారాలను దయచేసి ప్రోత్సహించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా అసత్య కథనాలను ప్రచారం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్న ఈ సమయంలో విషపూరిత ప్రచారం చేయడం సముచితం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ విభేదాలు ఏమైనా ఉంటే రాజకీయంగానే ఎదుర్కోవాలని సూచించారు. కానీ అబద్ధపు ప్రచారాలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఒక ప్రధాన టీవీ ఛానల్‌లో ఈ ప్రచారం జరగడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## 57 ఏళ్ల వయసులో సీవీ ఆనంద్ ఫిట్

**హెచ్‌సీఏ లీగ్ క్వార్టర్ ఫైనల్‌లో 50 రన్స్**

హైదరాబాద్, జనవరి 12 (ఈవార్తలు): సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ 57 ఏళ్ల వయసులోనూ తన ఫిట్‌నెస్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వన్డే లీగ్ ఛాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆయన ఓపెనర్‌గా బరిలోకి దిగి హాఫ్ సెంచరీ (50 పరుగులు) సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఇద్దరు యువ ఫిట్‌నెస్ ట్రైనర్లు కార్తీక్, మహాదేవ్.. తన ఫిట్‌నెస్ దినచర్య గురించి తెలుసుకోవడానికి అపాయింట్‌మెంట్ అడగగా, సీవీ ఆనంద్ వారిని నేరుగా సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌కు ఆహ్వానించారు. అక్కడ విక్టరీ జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో తన ఫిట్ నెస్ లెవల్స్ ను ప్రత్యక్షంగా చూపించారు. మ్యాచ్‌కు ముందు ఆయన వార్మప్ చేయడం, బ్యాటింగ్ ప్రాక్టీస్, ఆ తర్వాత ఓపెనర్‌గా బరిలోకి దిగి అర్ధ శతకం పూర్తి చేయడం వరకు వారు వీడియో తీశారు. ఈ వీడియోను కోచ్ కార్తీక్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన ఆనంద్, గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ భార్య ప్రసవం

కరీంనగర్, జనవరి 12 (ఈవార్తలు): కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ భార్య ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించారు. నగరంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ భార్య పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఆమె గత కొంతకాలంగా మాతా శిశు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. మొదటి కాన్పు కోసం ఆమె నిన్న మధ్యాహ్నం ఆసుపత్రిలో చేరారు. వైద్యులు ఆమెను పరీక్షించి, ఉమ్మనీరు తగ్గిన అనంతరం సోమవారం మధ్యాహ్నం శస్త్రచికిత్స ద్వారా ప్రసవం చేశారు. ఆడబిడ్డ జన్మించిందని, తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందిన నగరపాలక సంస్థ కమిషనర్ దంపతులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు.




## రెడ్‌బుక్‌ను తగలబెట్టండి: యాంకర్ శ్యామల

తాడేపల్లి, జనవరి 12 (ఈవార్తలు): ఏపీ మంత్రి నారా లోకేశ్ రెడ్ బుక్ పై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగం వల్ల ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు ప్రతి రైతు "అన్నమో రామచంద్ర" అంటూ లబోదిబో మంటూ ఏడుస్తున్నారని, వచ్చే రెండు సంక్రాంతుల్లో కూడా ప్రజల ముఖాల్లో చిరునవ్వు కనిపించకపోవచ్చని ఆమె వ్యాఖ్యానించారు. కానీ 2029 తర్వాత వచ్చే సంక్రాంతి నాటికి ప్రతి రైతు ముఖంలో చిరునవ్వు తెచ్చే బాధ్యతను వైసీపీ అధినేత జగన్ తీసుకుంటారని అన్నారు. ఈ బోగి మంటల్లో రాష్ట్రానికి కీడుగా మారిన రెడ్‌బుక్‌ను తగలబెట్టాలని శ్యామల పిలుపునిచ్చారు. ఈ రెడ్‌బుక్ పేరుతో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి, జోగి రమేశ్, కాకాణి గోవర్ధన్ రెడ్డి వంటి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేశారని ఆమె ఆరోపించారు. కోడిని కోసినా కేసు, కేక్ కట్ చేసినా కేసు అన్నట్టుగా పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రభుత్వ వ్యవస్థలు పనిచేస్తున్నాయని ఆమె తీవ్రంగా మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితులకు ప్రజలే తగిన సమయంలో గట్టి సమాధానం చెబుతారని, రాష్ట్రంలో మళ్లీ న్యాయం, సంక్షేమం రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



## బాధలో ఏపీ యువత

**వివేకానంద ఆశయాలక భిన్నంగా ఏపీలో పరిస్థితులు**

**ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి**

తాడేపల్లి, జనవరి 12 (ఈవార్తలు): జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. స్వామి వివేకానంద ఆలోచనలను ఆయన ప్రస్తావిస్తూ... యువత ఏకాగ్రత, లక్ష్యంతో కృషి చేస్తే దేశం బలపడుతుందని వివేకానంద నమ్మారని వివరించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో యువత మాత్రం ఆ ఆశయానికి భిన్నంగా ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 8 త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్లు చెల్లించలేదని, రూ.4,900 కోట్ల విద్యా దీవెన, రూ.2,200 కోట్ల వసతి దీవెన బకాయిలు పేరుకుపోయాయని జగన్ విమర్శించారు. మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన... నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి కూడా రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు నిలిపివేయడం వల్ల యువత నైపుణ్యాలు పెంచుకునే అవకాశాలు కూడా దూరమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ పాలనలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, చంద్రబాబు యువతకు వెన్నుపోటు పొడిచారని జగన్ విమర్శించారు. ఇకనైనా మేల్కొని యువతకు అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వానికి సూచించారు.

## విజయవాడలో అత్త దారుణ హత్య

విజయవాడ, జనవరి 12 (ఈవార్తలు): విజయవాడలోని సింగ్ నగర్‌లో చోటు చేసుకున్న దారుణ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. భార్యను కాపురానికి పంపడం లేదన్న కోపంతో ఓ అల్లుడు అత్తను కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన అందరిని షాక్‌కు గురి చేసింది. సింగ్ నగర్‌కు చెందిన కోలా దుర్గ కుమార్తెకు నాగసాయితో వివాహం జరిగింది. అయితే దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గొడవల నేపథ్యంలో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో భార్యను తనతో కాపురానికి పంపాలని నాగసాయి అత్త కోలా దుర్గను కోరాడు. ఇందుకు ఆమె అంగీకరించకపోవడంతో నాగసాయి తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. కోపంతో అత్త ఇంటికి వెళ్లిన అతడు కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఈ దాడిలో కోలా దుర్గకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. నిందితుడు నాగసాయి స్థానికంగా ఓ బట్టల దుకాణంలో పని చేస్తున్నాడని సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని నాగసాయిని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, నాగసాయిపై గతంలోనే అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

## ట్రంప్ టార్గెట్ క్యూబా

**చమురు, ఆర్థిక సహాయం ఉండవని వెల్లడి**

వాషింగ్టన్: క్యూబా టార్గెట్‌గా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. క్యూబా అనేక సంవత్సరాలుగా డబ్బు, చమురు కోసం వెనెజువెలాపై ఆధారపడిందని పేర్కొన్నారు. ఇకపై క్యూబాకు చమురు గానీ, ఆర్థిక సహాయం గానీ ఉండవని స్పష్టం చేశారు. పరిస్థితి చేయి దాటిపోకముందే క్యూబా ఒప్పందానికి రావాలని ట్రంప్ హుకుం జారీ చేశారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో హెచ్చరిక పోస్టు చేశారు. ఇదిలా ఉండగా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో క్యూబా అధ్యక్షుడవుతారంటూ ఓ నెటిజన్ చేసిన ట్వీట్‌పై స్పందిస్తూ ఇది వినడానికి బాగుంది అని ట్రంప్ వ్యాఖ్యానించారు. వెనెజువెలా నుంచి భారీగా అందిన చమురు, డబ్బుపైనే క్యూబా ఏళ్ల తరబడి ఆధారపడిందన్న ట్రంప్.. దానికి ప్రతిఫలంగా వెనెజువెలా నేతలకు భద్రతా సేవలు అందించిందని తెలిపారు. అయితే ఇకపై అలాంటిది జరగదని స్పష్టం చేశారు.

# కేసులు పెండింగ్ ఉండొద్దు

**వార్షిక క్రైం సమీక్షలో ఎస్పీ అశోక్ కుమార్**



జగిత్యాల, జనవరి 12 (ఈవార్తలు): పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఇయర్లీ క్రైమ్ మీటింగ్ సమావేశంలో.. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, ఇతర విభాగాల పనితీరుపై ఆయన వార్షిక సమీక్ష నిర్వహించారు. వివిధ రకాల నేరాలలో చోటు చేసుకున్న హెచ్చుతగ్గులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2024తో పోల్చితే 2025లో నేరాల తగ్గుదల కనబరిచారని, దీనికి కృషి చేసిన అధికారులను అభినందించారు. గత సంవత్సరంతో పోలిస్తే గ్రేవ్ కేసులను చాలా వరకు నియంత్రించగలిగామని అన్నారు. పెరిగిన నేరాలపై కారణాలను విశ్లేషించి, పెండింగ్ కేసులను అత్యంత ప్రాధాన్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గడిచిన సంవత్సరం పోలీస్ స్టేషన్‌ల పనితీరు, కేసుల దర్యాప్తులో సాధించిన పురోగతిని సమీక్షించుకుంటూ, రానున్న రోజుల్లో మరింత దృఢ సంకల్పంతో పని చేయాలని సూచించారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు స్పష్టమైన ప్రణాళికతో చర్యలు చేపట్టాలని తెలిపారు. డీఎస్పీలు, సీఐలు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లను తరచూ తనిఖీ చేసి, నమోదైన కేసుల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత ఎస్ఐలకు దర్యాప్తుపై అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటరమణ, రఘు చందర్, రాములు, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీఖాన్, రవీందర్, శ్రీనివాస్, కిరణ్ కుమార్, వేణు, సైదులు సీ.ఐ లు సుధాకర్, కరుణాకర్, రామ్ నరసింహారెడ్డి, సురేష్, రవి మరియు ఎస్ఐలు, డీసీఆర్బీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



# యువతకు స్ఫూర్తి వివేకానంద

మల్యాల, జనవరి 12 (ఈవార్తలు): యువతకు స్ఫూర్తి ప్రదాత, దేశ ప్రతిష్టను విశ్వవ్యాపితం చేసిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద అని మల్యాల సర్పంచ్ బొట్ల జయ ప్రసాద్ అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా సోమవారం మల్యాల మండల కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహానికి ఆమె నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్యంపేట సర్పంచ్ దారం ఆదిరెడ్డి, పద్మనాయక వెల్మ సంఘం అధ్యక్షుడు అయిలేని సాగర్ రావు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బోడ గోవర్ధన్, వార్డ్ సభ్యులు మల్యాల గణేశ్, పోతారాజు శ్రీనివాస్, నాయకుడు నల్లపు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# 14 పాస్‌పోర్టులు సీజ్

**మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ నిర్వాహకుడిపై కేసు.. జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ వెల్లడి**




జగిత్యాల, జనవరి 12 (ఈవార్తలు): విదేశీ ఉద్యోగాల ఆశ చూపి నిరుద్యోగ యువతను మోసగించిన నకిలీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ గుట్టును జగిత్యాల పోలీసులు ఛేదించారు. జగిత్యాల జిల్లా కేంద్రంగా నడుస్తున్న విజేత మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ నిర్వాహకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి 114 పాస్ పోర్టులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం టౌన్ పీఎస్ లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన కాముని గంగాధర్ జగిత్యాల జిల్లా కేంద్రంలోని విజేత మ్యాన్ పవర్ కన్సల్టెన్సీని నిబంధనలకు విరుద్ధంగా లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నాడు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగ యువతను నమ్మించి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసిన గంగాధర్, ఉద్యోగ వీసాల బదులు విజిట్ వీసాలపై విదేశాలకు పంపి మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ మోసానికి గురైన బాధితుల్లో ఒకరైన కరీంనగర్ జిల్లా గోపులాపూర్ గ్రామానికి చెందిన ఆరెల్లి రవీందర్ జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయింది. ఫిర్యాదు ఆధారంగా విజేత మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ పై సోదాలు నిర్వహించిన పోలీసులు 114 పాస్‌పోర్టులు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌తో పాటు కీలక ఆఫీస్ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా కన్సల్టెన్సీని లీజుకు ఇచ్చిన వ్యక్తి పై కూడా కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రఘు చందర్ తెలిపారు. నిందితులపై ఐపీసీ సెక్షన్లతో పాటు ఇమిగ్రేషన్ యాక్ట్, పాస్‌పోర్ట్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు వివరించారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారు తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న, ప్రభుత్వ అనుమతి పొందిన కన్సల్టెన్సీల ద్వారానే సంప్రదింపులు జరపాలని సూచించారు.



## 6 గంటల పాటు విజయ్‌పై ప్రశ్నలు

**తొలిరోజు ముగిసిన విజయ్ సీబీఐ విచారణ**

చెన్నై: కరూర్ తొక్కిసలాట ఘటనపై సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ సీబీఐ తొలిరోజు విచారణ ముగిసింది. విజయ్‌ను ఆరు గంటలకు పైగా విచారించిన సీబీఐ అధికారులు, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. సంక్రాంతి తర్వాత సీబీఐ మరోసారి ఆయనను విచారించనుంది. తొక్కిసలాట ఘటనకు టీవీకేకు ఎలాంటి సంబంధం లేదని ఆయన విచారణ సందర్భంగా అధికారులతో చెప్పినట్లు సమాచారం. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకే తాను అక్కడి నుంచి వెళ్లిపోయానని ఆయన తెలిపారు. ఇదే వ్యవహారంపై పార్టీ కార్యకర్తలను సీబీఐ ప్రశ్నించినప్పుడు కూడా వారు ఇదే తరహా సమాధానం చెప్పారని తెలుస్తోంది. విజయ్ నుంచి మరిన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాల్సి ఉంది. అయితే, పొంగల్ సందర్భంగా తనకు విరామం కావాలని విజయ్ కోరగా, సీబీఐ అందుకు అంగీకరించిందని సమాచారం. విజయ్ విచారణకు వస్తున్నాడని తెలుసుకున్న అభిమానులు పెద్ద సంఖ్యలో సీబీఐ కార్యాలయానికి చేరుకున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దీనిపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు పలు వివరాలు సేకరించారు.

## అంజన్న సేవలో వడ్డేపల్లి రాంచందర్



మల్యాల, జనవరి 12 (ఈవార్తలు): జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ కొండగట్టు ఆంజనేయ స్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వడ్డేపల్లి రాంచందఅబశ్రీశ్రీర్‌కు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బీ రాజగౌడ్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్ కుమార్ ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి, సౌకర్యాలపై అధికారులతో చర్చించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భద్రత, నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయ ప్రశాంత వాతావరణాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంతారావు, మల్యాల ఎమ్మార్వో వసంత, తదితరులు పాల్గొన్నారు.



# నారావారిపల్లెకు చంద్రబాబు

**సంక్రాంతి వేడుకల కోసం స్వగ్రామానికి**

**నాలుగు రోజుల పాటు స్వగ్రామంలోనే బస**

చిత్తూరు, జనవరి 12 (ఈవార్తలు): సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వగ్రామం నారావారిపల్లెకు చేరుకున్నారు. ప్రతి ఏటా కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకునే సీఎం చంద్రబాబు... ఆ ఆనవాయతీని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా స్వగ్రామానికి తరలివెళ్లారు. సోమవారం నాడు మంత్రులు, సెక్రటరీలు, కలెక్టర్లతో సచివాలయంలో సమీక్షా సమావేశం అనంతరం సాయంత్రం నారావారిపల్లెకు హెలికాప్టర్ లో పయనమయ్యారు. స్వగ్రామంలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, నేతలతో కలిసి రేపు సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారు. మంగళవారం నాడు నారావారిపల్లెతో పాటు తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేస్తారు. మంగళవారం ఉదయం 8 గంటలకు గ్రామంలోని టీటీడీ కళ్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం శేషాచల లింగేశ్వర స్వామి దేవస్థానం వద్దకు వెళ్లనున్నారు. రూ.70 లక్షలతో రంగంపేట--భీమవరం రోడ్డు నుంచి శేషాచల లింగేశ్వర స్వామి ఆలయం వరకు నిర్మించిన రహదారిని ప్రారంభిస్తారు. నారావారిపల్లెలో 33/11 కేవీ సెమీ ఇండోర్ సబ్ స్టేషన్, రూ.1.4 కోట్లతో పరిశ్రమల అవసరాలకు తగినట్టుగా యువతకు శిక్షణ ఇచ్చేలా నిర్మించిన స్కిల్ బిల్డింగ్ సెంటర్, సంజీవని ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఇక తిరుపతిలో రూ.45 లక్షలతో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర రామ్‌నారాయణ్ రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్ అటెండెంట్ అమీనిటీస్ కాంప్లెక్స్, ఎస్వీ యూనివర్సిటీలో రూ.7.5 కోట్లతో నిర్మించిన బాయ్స్ హాస్టల్, రూ.5 కోట్లతో నిర్మించిన గర్ల్స్ హాస్టల్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. మూలపల్లిలో నీటి సరఫరాకు సంబంధించి నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కల్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువుతో పాటు మరో 4 చెరువులకు నీటిని తరలించేలా రూ.126 కోట్లతో చేపట్టే ప్రాజెక్టుకు, రూ.10 లక్షలతో పశువుల వసతి సముదాయానికి శంకుస్థాపన చేస్తారు. ఎస్వీ యూనివర్సిటీలో పరిశోధన, ఆవిష్కరణలకు ఊతం ఇచ్చేలా రూ.6 కోట్లతో సెంట్రలైజ్డ్ అడ్వాన్స్ పరిశోధన ల్యాబ్స్, విద్యా మౌలిక వసతుల్లో భాగంగా రూ.5.03 కోట్లతో అకడమిక్ బిల్డింగ్ 2వ అంతస్తుకు, రూ.2.91 కోట్లతో చేపట్టే కాపౌండ్ వాల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. 15వ తేదీన తమ గ్రామ దేవతైన నాగాలమ్మ గుడికి కుటుంబ సమేతంగా సీఎం చంద్రబాబు వెళతారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజున నారావారిపల్లె నుంచి అమరావతికి చేరుకుంటారు.

# కమల్ వ్యక్తిత్వ హక్కులకు రక్షణ

**అనధికార వాడకంపై మద్రాస్ హైకోర్టు ఆంక్షలు**

చెన్నై: ప్రముఖ నటుడు కమల్ హాసన్‌కు మద్రాస్ హైకోర్టులో సోమవారం కీలక ఊరట లభించింది. తన అనుమతి లేకుండా పేరు, చిత్రం, ఇమేజ్ లేదా ఇతర వ్యక్తిగత గుర్తింపులను వాణిజ్యపరంగా వాడుకోకుండా నిరోధిస్తూ న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తన 'పర్సనాలిటీ రైట్లను కాపాడాలంటూ కమల్ హాసన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సెంథిల్‌కుమార్ రామమూర్తి ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. తన పేరు, ఫొటోలతో టీ-షర్టుల వంటి వస్తువులను విక్రయిస్తున్నారని, దీనిని ఆపాలని కోరుతూ కమల్ హాసన్ దావా వేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు... చెన్నైకి చెందిన 'నీయే విడై' అనే సంస్థతో పాటు పలువురు గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థలు... కమల్ హాసన్ అనుమతి లేకుండా ఆయన ఫొటో, పేరు లేదా 'ఉలగనాయగన్' వంటి బిరుదులను ఉపయోగించరాదని ఆదేశించింది. కమల్ హాసన్ తరఫున సీనియర్ న్యాయవాది సతీష్ పరాశరన్ వాదనలు వినిపించారు. కమల్ ఇమేజ్‌ను వాణిజ్యపరంగా వాడుకోవడం ఆయన వ్యక్తిగత, ప్రచార హక్కులను స్పష్టంగా ఉల్లంఘించడమేనని వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి, ప్రాథమికంగా కేసులో పస ఉందని అభిప్రాయపడ్డారు. అయితే, ఈ ఉత్తర్వులు వ్యంగ్య చిత్రాలు (క్యారికేచర్), సృజనాత్మక విమర్శలు, ఇతర కళాత్మక పనులకు వర్తించవని కోర్టు స్పష్టం చేసింది. అయితే, అవి కూడా కమల్ హాసన్ ఇమేజ్‌ను వాణిజ్యపరంగా దుర్వినియోగం చేసేలా ఉండకూడదని పేర్కొంది. తన 65 ఏళ్ల సినీ ప్రస్థానంలో తన ఇమేజ్‌కు వాణిజ్యపరంగా ఎంతో విలువ ఉందని, అనుమతి లేకుండా ఉత్పత్తులు అమ్మడం వినియోగదారులను తప్పుదోవ పట్టించడమేనని కమల్ తన పిటిషన్‌లో తెలిపారు. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన కోర్టు, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఒక ఇంగ్లీష్, ఒక తమిళ దినపత్రికలో పబ్లిక్ నోటీసు జారీ చేయాలని కమల్‌ను ఆదేశించింది. తదుపరి విచారణ వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి.




# మారనున్న పీఎంవో చిరునామా

## కొత్త కార్యాలయానికి ప్రధాని మోదీ.. రాయ్‌సీనా హిల్స్ వద్ద సిద్ధమైన కొత్త ఆఫీస్

### 'సేవా తీర్థ'గా నామకరణం చేసిన కేంద్రం.. ఈ నెల 14 తర్వాత పీఎంవో తరలింపు

న్యూఢిల్లీ: భారత ప్రధాని కార్యాలయం (పీఎంవో) చిరునామా త్వరలో మారనుంది. సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అత్యాధునిక కార్యాలయ భవన సముదాయంలోకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. జనవరి 14 తర్వాత, మకర సంక్రాంతి అనంతరం ఆయన కొత్త కార్యాలయంలోకి ప్రవేశించవచ్చని ప్రభుత్వ వర్గాల సమాచారం మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఢిల్లీలోని సౌత్ బ్లాక్ నుంచే పీఎంవో కార్యకలాపాలు సాగుతుండగా, 78 ఏళ్ల తర్వాత తొలిసారి ఈ కార్యాలయం వేరే చోటుకు మారుతుండటం చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుంది. రాయ్‌సీనా హిల్స్‌కు సమీపంలో, దారా షికో రోడ్డులో నిర్మించిన ఈ కొత్త భవన సముదాయానికి 'సేవా తీర్థ' అని ప్రభుత్వం నామకరణం చేసింది. ఇందులో మొత్తం మూడు భవనాలు ఉన్నాయి. 'సేవా తీర్థ్-1'ను పీఎంవో కోసం, 'సేవా తీర్థ్-2'ను కేబినెట్ సెక్రటేరియట్ కోసం, 'సేవా తీర్థ్-3'ను జాతీయ భద్రతా మండలి కోసం కేటాయించారు. ఇప్పటికే కేబినెట్ సెక్రటేరియట్ గత ఏడాది సెప్టెంబర్‌లోనే కొత్త భవనంలోకి మారింది. ఇప్పుడు పీఎంవో కూడా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో లార్సెన్ అండ్ టూబ్రో సంస్థ రూ.1,189 కోట్ల వ్యయంతో 24 నెలల్లో ఈ నిర్మాణం పూర్తి చేసింది. పాలనలో అధికారం ('సత్తా') కాకుండా సేవకే ('సేవ') ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పేందుకే ఈ భవనానికి 'సేవా తీర్థ' అని పేరు పెట్టినట్లు గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ప్రధాని కార్యాలయం, కేబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి వంటి కీలక కార్యాలయాలన్నీ



ఒకేచోట ఉండటం వల్ల సమన్వయం మెరుగవుతుందని, భద్రత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పీఎంవో పూర్తిగా ఖాళీ అయిన తర్వాత చారిత్రక నార్త్, సౌత్ బ్లాక్‌లను 'యుగ యుగీన్ భారత్ సంగ్రహాలయ' పేరుతో జాతీయ మ్యూజియంగా మార్చనున్నారు.

## 15న స్టాక్ మార్కెట్ల మూసివేత

**ప్రకటించిన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ**

**డెరివేటివ్ కాంట్రాక్టులు 14నే ముగింపు**

ముంబై: మహారాష్ట్రలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లకు జనవరి 15న సెలవు ప్రకటించారు. ఆ రోజు ట్రేడింగ్ జరగదని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సోమవారం వేర్వేరు ప్రకటనల్లో స్పష్టం చేశాయి. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) సహా రాష్ట్రంలోని 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జనవరి 15న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్-1881 కింద ఆ రోజును ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించింది. దీనివల్ల బ్యాంకులు కూడా పనిచేయవు. ఈ కారణంగా ట్రేడింగ్, సెటిల్మెంట్ కార్యకలాపాలను నిలిపివేయాలని ఎక్స్ఛేంజీలు నిర్ణయించాయి. జనవరి 15న ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్స్, కమోడిటీ డెరివేటివ్స్ సహా ఏ విభాగంలోనూ ట్రేడింగ్ ఉండదని బీఎస్ఈ తన సర్క్యులర్‌లో తెలిపింది. అలాగే, జనవరి 15న ముగియాల్సిన డెరివేటివ్ కాంట్రాక్టుల గడువును ఒక రోజు ముందుకు జరిపి, జనవరి 14నే ముగిస్తామని వెల్లడించింది. వాస్తవానికి, మొదట దీనిని కేవలం సెటిల్మెంట్ హాలిడేగా ప్రకటించినప్పటికీ, తాజాగా పూర్తిస్థాయి ట్రేడింగ్ సెలవుగా మార్చారు. ఈ మార్పుతో 2026లో స్టాక్ మార్కెట్లకు మొత్తం 16 సెలవులు ఉండనున్నాయి. ఈ నెలలో రెండో సెలవు జనవరి 26న (గణతంత్ర దినోత్సవం) రానుంది. మార్చి 3న హోలీ, ఏప్రిల్ 3న గుడ్ ఫ్రైడే, మే 1న మహారాష్ట్ర డే వంటివి ఈ ఏడాదిలోని ఇతర ప్రధాన సెలవులు.

## ఇండోనేషియా, మలేసియాలో గ్రోక్ బ్లాక్

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు ఎలాన్ మస్క్ కు చెందిన ఎక్స్ కంపెనీ అభివృద్ధి చేసిన ప్రసిద్ధ ఏఐ చాట్‌బాట్ గ్రోక్ మళ్లీ వివాదాల్లో చిక్కుకుంది. ఇటీవల గ్రోక్‌ని ఉపయోగించి నకిలీ, అశ్లీల డీప్‌ఫేక్ చిత్రాలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు రావడంతో ఇండోనేషియా, మలేషియా దేశాలు దీనిని తాత్కాలికంగా నిషేధించాయి. మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి అభ్యంతరకరమైన కంటెంట్ తయారవుతోందని, ఇది డిజిటల్ ప్రపంచంలో కొత్త ముప్పుగా మారుతోందని ఆ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. భారత్ కూడా ఇటీవల ఇలాంటి అశ్లీల కంటెంట్ వ్యాప్తిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గ్రోక్ ఏఐని కొందరు దుర్వినియోగం చేసి, అనుమతి లేకుండా నకిలీ డీప్‌ఫేక్ చిత్రాలు, వీడియోలు తయారు చేస్తున్నారని మలేషియా కమ్యూనికేషన్స్ అండ్ మల్టీమీడియా కమిషన్ స్పష్టం చేసింది. ఇది వ్యక్తుల గౌరవం, భద్రతకు ముప్పు కలిగిస్తోందని, సమాజానికి తీవ్ర ప్రమాదమని వారు చెప్పారు. జనవరి 3, 8 తేదీల్లో ఎక్స్, గ్రోక్‌కి నోటీసులు పంపినా, కంపెనీలు యూజర్ల రిపోర్టింగ్ సిస్టమ్‌పై మాత్రమే దృష్టి పెట్టాయి కానీ, సమస్యకు నిజమైన పరిష్కారాలు అందించలేదని మలేషియా ప్రభుత్వం విమర్శించింది. దీంతో గ్రోక్‌ను తమ దేశంలో తాత్కాలికంగా బ్లాక్ చేశామని తెలిపింది. ఇక ఇండోనేషియా విషయానికి వస్తే, గ్రోక్ ద్వారా సృష్టిస్తున్న నకిలీ అశ్లీల కంటెంట్ మహిళలు, పిల్లలకు తీవ్ర ముప్పు అని కమ్యూనికేషన్స్ అండ్ డిజిటల్ మంత్రి ముత్యా హాఫీద్ అన్నారు. ఇది మానవ హక్కులు, డిజిటల్ భద్రతకు తీవ్ర ఉల్లంఘన అని ఆమె వివరించారు. తమ పౌరుల గౌరవం, భద్రతకు హాని జరగకుండా చూడాలని, గ్రోక్‌ను తాత్కాలికంగా నిషేధిస్తున్నామని, ఎక్స్ నుంచి వివరణ కోరామని ఇండోనేషియా ప్రభుత్వం ప్రకటించింది.

## ఇండియన్ ఆయిల్ బంకుల్లో కార్ల సర్వీసింగ్

**పెట్రోల్ బంకుల్లో మారుతీ సర్వీస్ సెంటర్ల ఏర్పాటు**

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తన వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా కీలక అడుగు వేసింది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)తో సోమవారం ఒక ముఖ్యమైన అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఐఓసీఎల్ ఫ్యూయల్ రిటైల్ అవుట్‌లెట్లలో (పెట్రోల్ బంకులు) మారుతి కార్ల సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాల ద్వారా వినియోగదారులు తమ కార్లకు సాధారణ నిర్వహణ (రొటీన్ మెయింటెనెన్స్), చిన్నచిన్న మరమ్మతులు, ఇతర ప్రధాన సర్వీసులను కూడా పొందవచ్చని మారుతి సుజుకీ ఒక ప్రకటనలో తెలిపింది. మహారత్న హోదా కలిగిన ఐఓసీఎల్‌కు దేశవ్యాప్తంగా 41,000 ఫ్యూయల్ స్టేషన్ల నెట్‌వర్క్ ఉంది. ఈ భాగస్వామ్యం ద్వారా వినియోగదారులు తరచుగా వెళ్లే ప్రదేశాల్లోనే కార్ సర్వీసింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం సులభమవుతుంది.



ఇప్పటికే దేశంలోని 2,882 నగరాల్లో 5,780 సర్వీస్ టచ్‌పాయింట్లను కలిగి ఉన్న మారుతీ సర్వీస్ నెట్‌వర్క్ ఈ ఒప్పందంతో మరింత బలోపేతం కానుంది. ఈ సందర్భంగా మారుతి సుజుకీ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సర్వీస్) రామ్ సురేష్ ఆకెళ్ల మాట్లాడుతూ, "కస్టమర్లకు కార్ సర్వీసింగ్‌ను వీలైనంత సులభంగా, సౌకర్యవంతంగా మార్చడమే మా లక్ష్యం. ఇందుకోసం ఇండియన్ ఆయిల్ అపారమైన నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటాం" అని వివరించారు. ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ (మార్కెటింగ్) సౌమిత్రా పి. శ్రీవాస్తవ మాట్లాడుతూ, "మా ఇంధన సేవలతో పాటు ప్రపంచస్థాయి ఆటోమోటివ్ నిర్వహణను అందిస్తుండటం సంతోషంగా ఉంది" అని తెలిపారు.

## క్రీడాసంఘాల్లో ఆటగాళ్లకే ప్రాధాన్యం

### భారత క్రీడా రంగంలో భారీ సంస్కరణలు.. కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు జారీ

న్యూఢిల్లీ: భారత క్రీడా రంగ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ క్రీడా సమాఖ్యల పాలకవర్గాల్లో మాజీ క్రీడాకారులకు, మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ 'జాతీయ క్రీడా పాలన (జాతీయ క్రీడా సంస్థలు) నిబంధనలు, 2026'ను నోటిఫై చేసింది. జాతీయ క్రీడా పాలన చట్టం, 2025 కింద ఈ కొత్త నియమాలను సోమవారం జారీ చేసినట్లు కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిబంధనల ప్రకారం, ప్రతి జాతీయ క్రీడా సమాఖ్య జనరల్ బాడీలో 'అత్యుత్తమ ప్రతిభావంతులైన క్రీడాకారులు' (ఎస్ఓఎం) కోటాలో కనీసం నలుగురికి చోటు కల్పించాలి. వీరిలో 50 శాతం, అంటే ఇద్దరు మహిళలు ఉండటం తప్పనిసరి. అదేవిధంగా, ఎగ్జిక్యూటివ్ కమిటీలోనూ కనీసం నలుగురు మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని స్పష్టం చేశారు. క్రీడాకారుల ఎంపిక



కోసం వారి విజయాల ఆధారంగా ఒలింపిక్స్ పతక విజేతల నుంచి జాతీయ స్థాయి విజేతల వరకు 10 అంచెల ప్రమాణాలను నిర్దేశించారు. ఈ కోటాలో స్థానం పొందాలంటే క్రీడాకారులకు కనీసం 25 ఏళ్ల వయసు ఉండాలి, వారు క్రీడల నుంచి రిటైర్ అయి కనీసం ఏడాది గడిచి ఉండాలి. క్రీడా సమాఖ్యల ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు 'జాతీయ క్రీడా ఎన్నికల ప్యానెల్‌'ను ఏర్పాటు చేయనున్నారు. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలి జైలు శిక్ష పడిన వారు ఎన్నికల్లో పోటీ చేయడానికి, కమిటీలలో సభ్యులుగా ఉండటానికి అనర్హులుగా ప్రకటించారు. ఈ నిబంధనలు అమల్లోకి వచ్చిన ఆరు నెలల్లోగా అన్ని జాతీయ క్రీడా సమాఖ్యలు తమ నియమావళి (బై-లాస్) సవరించుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఏదైనా సమాఖ్య దరఖాస్తు చేసుకుంటే, 12 నెలల పాటు నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు.




## ఫిబ్రవరి 1నే కేంద్ర బడ్జెట్

### క్లారిటీ ఇచ్చిన స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2026-27 సమర్పణ తేదీపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఫిబ్రవరి 1, ఆదివారం రోజే బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోమవారం ధృవీకరించారు. ఓ విలేకరుల సమావేశంలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 1, ఆదివారం ఉదయం 11 గంటలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారని స్పీకర్ తెలిపారు. సాధారణంగా బడ్జెట్ ప్రవేశపెట్టే ఫిబ్రవరి 1వ తేదీ ఈసారి ఆదివారం కావడంతో తేదీలో ఏమైనా మార్పు ఉంటుందా అనే ఊహాగానాలు వినిపించాయి. తాజాగా స్పీకర్ ప్రకటనతో ఈ గందరగోళం తొలగిపోయింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను సమావేశాలకు ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశాలు రెండు విడతలుగా జరగనున్నాయి. తొలి విడత జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు, రెండో విడత మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉంటుంది. బీటింగ్ రిట్రీట్ కార్యక్రమం కారణంగా జనవరి 29న, శనివారం కావడంతో జనవరి 31న పార్లమెంట్ సమావేశం కాదు. జనవరి 30న ఆర్థిక సర్వేను సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం, బడ్జెట్‌పై చర్చల అనంతరం ఫిబ్రవరి 13న సభకు విరామం ప్రకటిస్తారు. ఏప్రిల్ 3న గుడ్ ఫ్రైడే ఉండటంతో సమావేశాలు ఒక రోజు ముందే ముగియవచ్చని తెలుస్తోంది.

## పుంజుకున్న స్టాక్ మార్కెట్లు

ముంబై: వరుసగా ఐదు రోజుల పాటు నష్టాలు చవిచూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో గట్టెక్కాయి. అమెరికా నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు ఇన్వెస్టర్లలో విశ్వాసం నింపడంతో సూచీలు తిరిగి పుంజుకున్నాయి. మంగళవారం నుంచే భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు ప్రారంభమవుతాయని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ చేసిన ప్రకటన మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. ఈ వార్తతో కీలక రంగాల్లో కొత్తగా కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో రోజులో నమోదైన కనిష్ఠ స్థాయిల నుంచి సూచీలు బలంగా కోలుకున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో దాదాపు 1,100 పాయింట్లు పెరిగింది. చివరకు 302 పాయింట్లు లాభపడి 83,878 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నిఫ్టీ కూడా మెరుగైన ప్రదర్శన కనబరిచింది. ఇంట్రా-డే కనిష్ఠ స్థాయి 25,473 నుంచి కోలుకుని, 107 పాయింట్ల లాభంతో 25,790 వద్ద ముగిసింది. '100-రోజుల ఈఎంఏ (25,540-25,600) కీలక మద్దతుగా నిలిచి, మార్కెట్ పుంజుకోవడానికి సహాయపడింది. తక్షణ నిరోధం 25,800-25,870 స్థాయిల్లో ఉంది' అని ఒక విశ్లేషకుడు తెలిపారు. అయితే, బ్రాడర్ మార్కెట్లలో ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.05 శాతం, స్మాల్‌క్యాప్ 0.52 శాతం మేర నష్టపోయాయి. ప్రస్తుతం ఇన్వెస్టర్లు సోమవారం సాయంత్రం విడుదలయ్యే డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల కోసం ఎదురుచూస్తున్నారు. అలాగే, ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై కూడా దృష్టి సారించారు. కమోడిటీస్ విభాగంలో, ముఖ్యంగా మెటల్స్ షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఇటీవల జరిగిన దిద్దుబాటు తర్వాత బ్యాంకింగ్, కన్జ్యూమర్ స్టాక్స్‌లో విలువ ఆధారిత కొనుగోళ్లు జరిగాయని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.



## మిత్రుల మధ్య విభేదాలు కామన్

**ట్రంప్-మోదీ మధ్య దూరం చిన్నదే: అమెరికా రాయబారి**



న్యూఢిల్లీ: తమ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య స్నేహబంధం నిజమైందేనని భారత్‌కు నూతన అమెరికా రాయబారిగా బాధ్యతలు చేపట్టిన సెర్గియో గోర్ పేర్కొన్నారు. నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమని, ట్రంప్, మోదీల మధ్య విభేదాలు కూడా అలాంటివేనని అన్నారు. వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగడానికి వారు ప్రయత్నిస్తారని తెలిపారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం అతిపెద్ద దేశమని, రెండు దేశాల మధ్య సత్సంబంధాలకు వాణిజ్యం చాలా కీలకమని గోర్ అభిప్రాయపడ్డారు. వీలైనంత త్వరగా వాణిజ్యం ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరు దేశాల ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన తెలిపారు. భద్రత, సాంకేతికత, ఆరోగ్యం, ఇంధనం వంటి రంగాల్లో కూడా రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని అన్నారు. భారతదేశమే తమకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందానికి సంబంధించి జనవరి 13న ఇరు దేశాల ప్రతినిధులు మరోసారి సమావేశం కానున్నట్లు సెర్గియో గోర్ వెల్లడించారు.

## ఇరాన్‌లో సర్కారు అనుకూల ఆందోళనలు

**మా అదుపులోనే పరిస్థితులు: ఇరాన్ మంత్రి అబ్బాస్**



టెహ్రాన్: తమ దేశంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని ఇరాన్ మంత్రి అబ్బాస్ అరాఘ్చి పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా నిరసనలతో ఇరాన్ అట్టుడుకుతోన్న విషయం విదితమే. ఆందోళనకారులను సైన్యం తీవ్రంగా అణిచివేస్తుండటంతో ఇరాన్ వీధులు నెత్తురోడుతున్నాయి. ఈ ఘర్షణల్లో వందలాది మంది మృతి చెందారు. మృతుల్లో భద్రతా సిబ్బంది కూడా ఉన్నారు. వేలాదిమందిని సైన్యం అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజధాని టెహ్రాన్‌లో విదేశీ దౌత్యవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ దేశంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని స్పష్టం చేశారు. ఆందోళనకారుల నిరసనలతో తమ దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ట్రంప్‌నకు ఒక సాకు దొరికిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ ఆందోళనకారులను ఉగ్రవాదులతో పోల్చారు. ఈ మూకలు సమాజాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. దేశాన్ని అస్థిరపరిచేందుకు ఇజ్రాయెల్, అమెరికా కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఆర్థిక సంక్షోభంలో ఇరాన్ కూరుకుపోవడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనకారులు ఆందోళనలకు దిగారు. భద్రతాదళాలు వారిపై దాడులు చేయడంతో 500 మందికి పైగా మృతి చెందారు.




## ఇస్రో రాకెట్ ప్రయోగం విఫలం

శ్రీహరికోట, జనవరి 12 (ఈవార్తలు): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలమైంది. తొలి రెండు దశల్లో సాఫీగా సాగిన రాకెట్.. మూడో దశలో గతి తప్పింది. ఈ రోజు ఉదయం 10.18 గంటలకు శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి పీఎస్ఎల్వీ-- సీ62 రాకెట్ నింగికెగిరింది. 18 నిమిషాల ప్రయాణం తర్వాత ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చాలి. అయితే, సాంకేతిక సమస్య వల్ల రాకెట్ తో సంబంధాలు తెగిపోయాయని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. సమస్యకు గల కారణాలను విశ్లేషిస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ రంగానికి అత్యంత కీలకమైన 'ఈఓఎస్-ఎన్1' లేదా 'అన్వేష' ఉపగ్రహంతో పాటు భారత్, యూకే, థయ్‌లాండ్, బ్రెజిల్, స్పెయిన్, నేపాల్ తదితర దేశాలకు చెందిన మరో 14 చిన్న ఉపగ్రహాలను కూడా ఈ రాకెట్ మోసుకెళ్లింది. అత్యంత కీలకమైన 'అన్వేష' ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో నిరాశ వ్యక్తమవుతోంది. కాగా, 2025 మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ -- సీ61 రాకెట్ ప్రయోగం కూడా ఇదేవిధంగా మూడో దశలోనే విఫలమైంది. ఈ ప్రయోగంలో జరిగిన తప్పొప్పులను నిశితంగా పరిశీలించి, పొరపాట్లను సరిదిద్దుకున్నాక చేపట్టిన తాజా ప్రయోగం కూడా ఫెయిలైంది.

## హిందీని రుద్దితే తరిమేస్తాం

**ఉత్తరాది వలసదారులకు రాజ్ థకరే వార్నింగ్**

ముంబై: 'హిందీ మీ భాష కాదనే విషయాన్ని ఉత్తరప్రదేశ్, బీహార్ వలసదారులు గుర్తుంచుకోవాలి. నాకు భాషపై ద్వేషం లేదు కానీ, దానిని మాపై బలవంతంగా రుద్దాలని చూస్తే మాత్రం తరిమికొడతాను' అని మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ థకరే హెచ్చరించారు. ముంబై మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. దాదాపు 20 ఏళ్ల విరామం తర్వాత థకరే సోదరులు (రాజ్, ఉద్ధవ్ థకరే) ఒకే వేదికపైకి వచ్చి మరాఠీ అస్తిత్వ నినాదాన్ని వినిపించారు. జనవరి 15న జరగనున్న ఎన్నికలను 'మరాఠీ మనుషుల ఉనికి కోసం జరుగుతున్న చివరి పోరాటం'గా రాజ్ థకరే అభివర్ణించారు. అన్ని వైపుల నుంచి జనం వచ్చి మహారాష్ట్ర ప్రయోజనాలను కొల్లగొడుతున్నారని, మన భాషను, భూమిని కాపాడుకోకపోతే మరాఠీ జాతి కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముంబైని దక్కించుకోవడానికి ఎందరో ప్రాణత్యాగం చేశారని, వారి సాక్షిగా మరాఠీ ప్రజలందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. సభలో శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ థకరే మాట్లాడుతూ.. ముంబైకి పొంచి ఉన్న ముప్పును అడ్డుకోవడమే లక్ష్యంగా తాము చేతులు కలిపామన్నారు. బీజేపీ తన సాంస్కృతిక, ఆర్థిక ఎజెండాతో ముంబైని గుజరాత్‌లో కలిపేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు నగరాన్ని ధారాదత్తం చేయడమే బీజేపీ అసలు ఉద్దేశమని, అందుకే హిందీని తప్పనిసరి చేసే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. మరాఠీ అస్తిత్వాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ పోరాటంలో తమతో కలిసి రావాలని థకరే సోదరులు విజ్ఞప్తి చేశారు.

వయ్యారి చిత్రం

సిమ్రన్ చౌదరి



# అడాల్ సెన్స్.. అవార్డుల పంట!

## గోల్డెన్ గ్లోబ్స్ 2026లో అడాల్‌సెన్స్ సిరీస్ దూకుడు

అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్న అడాల్‌సెన్స్ సిరీస్ మరోసారి ప్రపంచవ్యాప్తంగా చర్చకు వచ్చింది. తాజాగా ప్రకటించిన గోల్డెన్ గ్లోబ్స్ 2026 అవార్డుల్లో ఈ సిరీస్‌కు కీలక విభాగాల్లో గౌరవం దక్కింది. ముఖ్యంగా నటన విభాగాల్లో రెండు ప్రధాన అవార్డులు సొంతం చేసుకోవడంతో ఈ షో స్థాయిని మరో మెట్టు ఎక్కించింది. ఈ సిరీస్‌లో తన సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఓవెన్ కూపర్ అత్యంత చిన్న వయసులోనే ఉత్తమ సహాయనటుడు (టీవీ సిరీస్) గా గోల్డెన్ గ్లోబ్ అందుకుని అరుదైన రికార్డు సృష్టించాడు. అతని ప్రదర్శనపై మొదటి నుంచే విమర్శకుల నుంచి ప్రశంసలు రావడంతో ఈ అవార్డు అతని కెరీర్‌కు కీలక మైలురాయిగా మారింది. 83వ వార్షిక గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ ప్రదానోత్సవం కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్‌లో ఉన్న బెవర్లీ హిల్టన్ హోటల్ లో అట్టహాసంగా జరిగింది. అదే సమయంలో ఉత్తమ నటుడు (టీవీ సిరీస్) విభాగంలో స్టీఫెన్ గ్రాహంకు అవార్డు లభించింది. సిరీస్‌లో ఆయన పోషించిన పాత్రకు గల లోతు, భావోద్వేగాల తీవ్రత ఈ గౌరవాన్ని అందించిందని విశ్లేషకులు చెబుతున్నారు. అవార్డు స్వీకరణ సమయంలో ఓవెన్ కూపర్ తన ఆనందాన్ని పంచుకుంటూ, తనతో కలిసి పనిచేసిన అనుభవజ్ఞులైన నటీనటుల నుంచి ఎంతో నేర్చుకున్నానని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ తన జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే ప్రయాణమని ఆయన వ్యాఖ్యానించారు. ఇక ఈ ఏడాది గోల్డెన్ గ్లోబ్స్ వేడుకలను మరింత ప్రత్యేకంగా నిలిపేందుకు ప్రముఖ స్టాండ్-అప్ కామెడియన్ నిక్కీ గ్లేజర్తో పాటు గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా వ్యాఖ్యాతలుగా వ్యవహరించడం విశేషంగా మారింది. బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు గుర్తింపు పొందిన ప్రియాంక హాజరు ఈ వేడుకకు అదనపు ఆకర్షణగా నిలిచింది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటుల ప్రతిభకు ఈ వేడుక వేదికగా నిలిచింది







### గోల్డెన్ గ్లోబ్స్ 2026 విజేతలు:

- **ఉత్తమ నటుడు (టీవీ సిరీస్):** స్టీఫెన్ గ్రాహం -- అడాల్‌సెన్స్
- **ఉత్తమ నటి:** రోజీ బేర్న్ -- ఇఫ్ ఐ హేడ్ లెగ్స్ ఐ డిడ్ కిక్ యూ
- **ఉత్తమ స్క్రీన్‌ప్లే:** పాల్ థమస్ -- వన్ బ్యాటిల్ ఆనథర్
- **ఉత్తమ సహాయనటుడు (టీవీ సిరీస్):** ఓవెన్ కూపర్ -- అడాల్‌సెన్స్
- **ఉత్తమ సహాయ నటుడు (సినిమా):** స్టెలన్ -- సెంటిమెంట్ వాల్యూ
- **ఉత్తమ సహాయ నటి (సినిమా):** టెయానా టేలర్ -- వన్ బ్యాటిల్ ఆనథర్
- **ఉత్తమ దర్శకుడు:** పాల్ థమస్ ఆండర్సన్ -- వన్ బ్యాటిల్ ఆనథర్
- **ఉత్తమ సహాయ నటుడు (సినిమా):** స్టెలన్ -- సెంటిమెంట్ వాల్యూ
- **ఉత్తమ సహాయ నటి (సినిమా):** టేయానా టేలర్ -- వన్ బ్యాటిల్ ఆనథర్
- **ఉత్తమ సినిమాటిక్ అండ్ బాక్స్ ఆఫీస్ అచీవ్‌మెంట్:** స్పిన్నర్స్
- **ఉత్తమ యానిమేటెడ్ మోషన్ పిక్చర్:** కే-పాప్ డీమన్ హంటర్స్

మొత్తంగా చూస్తే, అడాల్‌సెన్స్ సిరీస్ గోల్డెన్ గ్లోబ్స్ వేదికపై మరోసారి తన సత్తా చాటుతూ, అంతర్జాతీయ టీవీ రంగంలో ప్రత్యేక స్థానాన్ని మరింత బలపరుచుకుంది.

# రివ్యూ: మన శంకరవరప్రసాద్ గారు!

కథ కావాలి.. కథనం ఉండాలి అనుకుంటే మన శంకరవరప్రసాద్ గారు మీకు నచ్చరు. నో లాజిక్.. ఓన్లీ వింటేజ్ మెగా మ్యాజిక్ కోసం అయితే మన శంకరవరప్రసాద్ గారు మనసుకి నచ్చేస్తారు. ఇప్పుడు అసలు విషయంలోకి వచ్చేద్దాం.. అయ్యా అనిల్ రావిపూడి నీకు కోటి దండాలు స్వామి. ఈ జనరేషన్ దర్శకులను చిరంజీవిని నువ్వు అర్థం చేసుకున్నట్టు ఎవరు అర్థం చేసుకోలేదు. పాతికేళ్లు దాటిపోయింది మెగాస్టార్ ను అలా స్క్రీన్ మీద చూసి. అప్పుడెప్పుడో నేను స్కూలుకి వెళ్లే టైంలో.. అన్నయ్య సినిమాలో ఇలాంటి కామెడీ టైమింగ్ చూశా. ఆ తర్వాత ఎన్నో బ్లాక్బస్టర్స్ చిరంజీవి ఇచ్చాడు కానీ.. ఆ కామెడీ మాత్రం రాలేదు. ఇన్నాళ్లకు ఆ లోటు నువ్వు తీర్చేసావు. ఫస్టాఫ్ లోనే పైసా వసూల్ అయిపోయింది. మెగా వింటేజ్ చమక్కులు.. ఆ పంచ్ డైలాగులు.. సెల్ఫ్ సెటైర్లు.. చిరంజీవికి మాత్రమే సాధ్యమైన కొన్ని మోడ్యులేషన్స్.. ఏ ఒక్కటి వదలకుండా స్క్రీన్ మీద దించేశావు.. అందుకే నీకు కోటి దండాలు. ఇక చిరంజీవి కూడా ఎంత ఆకలి మీద ఉన్నాడో అనేది ఈ సినిమా చూస్తే




అర్థమవుతుంది. తనకు కామిక్ క్యారెక్టర్ దొరికితే ఎలా రెచ్చిపోతాడో మరోసారి ప్రూవ్ చేశాడు మెగాస్టార్. జస్ట్ టైం గ్యాప్ అంతే టైమింగ్ లో అస్సలు గ్యాప్ ఉండదని స్క్రీన్ మీద రఫ్ ఆడించాడు. ఒక్కొక్క సీనులో చిరంజీవి కామెడీ టైమింగ్ చూస్తుంటే ఘరానా మొగుడు గుర్తొచ్చింది.. ఫస్టాఫ్ అయితే హిలేరియస్. సెకండ్ హాఫ్ అక్కడక్కడ కాస్త తగినట్టు అనిపిస్తుంది కానీ చివర్లో సెట్ అయిపోయింది. వెంకటేష్ వచ్చాక స్క్రీన్ దద్దరిల్లిపోయింది.. నేను ఊహించినంత లేదు కానీ పర్లేదు. చిన్న చిన్న సీన్స్ కూడా అనిల్ రావిపూడి రాసిన దానికంటే 100 రెట్లు ఇంప్రోవైజ్ చేశాడు చిరు. సింపుల్ గా చెప్పాలంటే శంకరవరప్రసాద్ గా తన ఆకలి మొత్తం తీర్చేసుకున్నాడు బాస్. లుక్స్ పరంగా కూడా చిరంజీవి నెక్స్ట్ లెవెల్ లో ఉన్నాడు.. హుక్ స్టెప్, మెగా విక్టరీ సాంగ్స్ విజువల్ గా అదిరిపోయాయి. నయనతార కూడా చాలా అందంగా ఉంది. వెంకటేష్ ఉన్న 20 నిమిషాలు అతికించినట్లు అనిపించింది కానీ ఫ్యామిలీ ఆడియన్స్ కు బాగా కనెక్ట్ అవుతుంది. ఈ తరం దర్శకులలో ఆడవాళ్ళ సైకాలజీ అనిల్ రావిపూడి కంటే ఎవరికీ బాగా తెలియదు. సెకండ్ హాఫ్ లో వాళ్ళ సైకాలజీ మీద వచ్చే ఒక సీన్ భలే ఉంది. భీమ్స్ మ్యూజిక్ బాగుంది..

**ఓవరాల్‌గా.. మన శంకరవరప్రసాద్ గారు.. బాగున్నారు.. పండక్కి నవ్విస్తారు..!**

**సమీక్షకుడు: ప్రవీణ్ కుమార్, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు**



## డిప్రెషన్‌తో సూసైడ్ ఆలోచనలు

చెప్పుకోలేని బాధ, విపరీతమైన ఆలోచనలతో ఇబ్బందిపడినప్పుడు మానసిక చికిత్స తీసుకోవడం చాలా అవసరం అంటోంది మలయాళీ బ్యూటీ పార్వతి తిరువోతు. తాను డిప్రెషన్ కు గురైనప్పుడు థెరపీ ద్వారా నయం చేసుకున్నానంది. 'కరెక్ట్ థెరపిస్ట్ దొరకడానికి చాలా సమయం పట్టింది. మొదట్లో అమెరికన్ థెరపిస్టులను కలిసాను. అర్ధరాత్రి పూట వారు నాతో మాట్లాడేవారు. వారితో సాధ్యపడదని తెలుసుకుని స్థానిక థెరపిస్టులను కలిసాను. వారు నా సమస్య ఏంటి? అన్నది గుచ్చి గుచ్చి మరీ అడిగి తెలుసుకున్నారు. అప్పటికే నేను తీవ్రమైన ఒంటరి తనంతో బాధపడుతున్నాను.

## అనుకోకుండా పరిశ్రమలోకి వచ్చా



ప్రముఖ బాలీవుడ్ హీరోయిన్ రాణీ ముఖర్జీ ఇండస్ట్రీలో మూడు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యష్ రాజ్ ఫిల్మ్స్ అఫీషియల్ సోషల్ మీడియా అకౌంట్ లో ఓ పర్సనల్ నోట్ ను షేర్ చేశారు. అప్పుడే 30 ఏళ్లు పూర్తయ్యాయంటే నమ్మశక్యం కావడం లేదని, యాక్టింగ్ ను డెస్టినేషన్ లాగా అనుకోకపోవడం వల్లే టైమ్ చాలా వేగంగా గడిచిపోయినట్టు అనిపించిందని ఆమె రాసుకొచ్చారు. తాను అనుకోకుండా సినీ ఇండస్ట్రీలోకి వచ్చానని, మొదటి సినిమా టైమ్ లో ఎంతో భయపడిన ఆమె, తర్వాత బాలీవుడ్ లో ఎంతో పెద్ద స్టార్ హీరోయిన్ అయినప్పటికీ, ఫస్ట్ సినిమా టైమ్ లో ఉన్న ఎనర్జీ, తడబాటును తాను ఇప్పటికీ ప్రతీ క్యారెక్టర్ లోకి తీసుకెళ్తున్నట్టు తెలిపారు.

## తొక్కుకుంటూ పోతారు

ఒక్క సక్సెస్ ఆ నటిని ఎలాంటి స్థానానికైనా తీసుకెళ్లి కూర్చో బెట్టగలదు. తాజాగా హర్యానా బ్యూటీ మీనాక్షి చౌదరి ఇదే అంశంపై మాట్లాడింది. తన దృష్టిలో సినిమా అనేది ముగింపు లేని ప్రయాణం గా పేర్కొంది. స్థిరపడిపోయామని సంతృప్తి పడ్డామంటే? అక్కడితో కెరీర్ ముగిసినట్లే అవుతుందంది. కొత్త వారితో పోటీని ఎదుర్కొని ముందుకెళ్లాల్సిందే. అలా చేయలేకపోతే కొత్త వారు మన స్థానంలోకి వచ్చి కూర్చుంటారంది. అందుకే మీనాక్షి ఎప్పుడు స్థిరపడ్డాని అనుకోనంది. చేతిలో నిత్యం పని ఉండాలంటే? విభిన్న పాత్రలు పోషిస్తూ నిర్విరామంగా పరిగెడుతూనే ఉండాలంది. ఇంత మంది ఉన్న పరిశ్రమలో మనకే అవకాశాలు రావాలంటే? వాళ్ల చిత్రాలకు మనం ఉండటం వల్ల ఏదో ఉపయోగం ఉంటుందని దర్శక, నిర్మాతలు భావించాలి. వారు బలంగా నమ్మేలా చేయాలంది. అందు కోసం నటిగా వందశాతం కష్టపడినప్పుడే అది సాధ్యమవుతుంది. టైంపాస్ గా సినిమాలు చేద్దామంటే కెరీర్ కూడా అలాగే ముందుకు సాగుతుందని అభిప్రాయపడింది. ఈ సంక్రాంతి కి అమ్మడు అనగనగనా ఒక రాజు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో నవీన్ పోలిశెట్టికి జంటగా నటించింది.





# రిద్ధీ బిస్తర్ మరాఠీకి!

ముంబై బ్యూటీ రిద్ధీ కుమార్ టాలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. 'లవర్ణ ,' అనగనగా ఓ ప్రేమ కథ'లో హీరోయిన్ గా నటించింది. అటుపై 'రాధేశ్యామ్ణ లో కీలక పాత్రలో కనిపించింది. కానీ ఈ సినిమాలేవి కూడా రిద్ధీ కుమార్ కు కలిసి రాలేదు. కెరీర్ పరంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు కనిపించింది. బాలీవుడ్ సహ మరాఠీలోనూ అదే పరిస్థితి. రెండు మూడు సినిమాలు చేసింది అనే పేరు తప్ప అక్కడా ఏనాడు బిజీ కాలేదు. సరిగ్గా ఇదే సమయంలో దర్శకుడు మారుతి రిద్ధీ కుమార్ లో ఫ్యూచర్ హీరోయిన్‌ను చూశాడు. దీంతో మరో ఆలోచన లేకుండా పాన్ ఇండియా చిత్రం ''ది రాజాసాబ్ణ' లో ఛాన్స్ ఇచ్చాడు. కానీ ఇటీవలే రిలీజ్ అయిన ఈ సినిమా ఫలితం తెలిసిందే. రిద్ధీ కుమార్ పాత్రపై ఎలాంటి ఫీడ్ బ్యాక్ వచ్చిందో కూడా తెలిసిందే. కానీ ఈ సినిమాపై రిద్ధీ కుమార్ మాత్రం రిలీజ్ కు ముందు చాలా ఆశలు పెట్టుకుంది. విజయంతో టాలీవుడ్ లో బిజీ అవ్వాలనుకుంది. ఇంకా ఎన్నో కలలు కంది. నటిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాలి..తొలి సారి జరిగిన తప్పిదాలు రిపీట్ అవ్వకుండా కెరీర్ ముందుకు సాగించాలని ఓ ప్రణాళిక సిద్దం చేసి పెట్టుకుంది.





సినిమా సెలబ్రిటీలు, క్రికెట్ స్టార్లు సోషల్ మీడియాలో చిన్న పోస్ట్ పెట్టినా అది క్షణాల్లో వైరలవుతుంది. అలాంటిది వారు ఏదైనా బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నారంటే అభిమానులు పోటీపడి మరీ కొనుక్కుంటారు. తాజాగా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ ఒకే ఒక సరదాగా చేసిన ఓ కామెంట్ శీతల పానీయాల తయారీ కంపెనీ కోక-కోలాకు వందల కోట్ల డబ్బు తెచ్చిపెట్టింది. గత మూడు రోజులుగా స్టాక్ మార్కెట్లో ఆ సంస్థ షేర్ దాదాపు 5 శాతం అంటే 12.9 బిలియన్ డాలర్లు పెరిగింది.

## వైన్‌లో స్ప్రైట్ కలిపి తాగుతా!

### మెస్సీ కామెంట్‌తో 5 శాతం పెరిగిన కోకాకోలా షేర్లు

ఇంతకూ మెస్సీ ఏం అన్నాడంటే..? ఈ మధ్యే గోట్ ఇండియా టూర్ 2025లో భాగంగా భారత పర్యటనలో అభిమానులను రంజింపజేసిన లియోనల్ మెస్సీ అమెరికా స్టాక్ మార్కెట్‌ను షేక్ చేశాడు. లుజ్ టీవీతో మాట్లాడుతూ తన డ్రింక్ కాంబినేషన్ గురించి చెప్పాడతడు. 'నాకు వైన్ అంటే ఇష్టం. ఒకవేళ అది లేదంటే నా ఫేవరెట్ కాంబినేషన్ ఎలాగూ ఉండనే ఉంది. స్ప్రైట్‌తో కలిపి వైన్ తీసుకుంటా. ఈ కాంబినేషన్‌ల్ చాలా బాగుంటుంది' అని మెస్సీ అన్నాడు. సాకర్ ఐకాన్ అలా చెప్పడమే ఆలస్యం.. అమెరికా స్టాక్ మార్కెట్లో కోక కోలా కంపెనీ షేర్లు దాదాపు 5 శాతం అంటే 12.9 బిలియన్ (భారతీయ కరెన్సీలో రూ.11,63,00,77,00,530) డాలర్లకు ఎగబాకాయి. వైన్, స్ప్రైట్ కలిపి తాగడమేంటీ? అని ఒకింత ఆశ్చర్యం వేయకమానదు. ఇదే విషయంపై అర్జెంటీనా స్టార్ ఫన్నీగా స్పందించాడు. ' వైన్, స్ప్రైట్ మిక్స్ చేసుకొని తాగితే నాకు రిలాక్స్‌గా అనిపిస్తుంది. అంతేకాదు నేను ఒంటరిగా కాసేపు డిపేందుకు అవకాశం దొరకుతుంది. ఎందుకంటే.. ఇంట్లో ముగ్గురు పిల్లలు తెగ అల్లరి చేస్తారు. వారు నా శక్తినంతా తోడేస్తారు. అలాంటప్పుడు వైన్, స్ప్రైట్‌తో చిల్ అవుతా' అని వెల్లడించాడు. క్రీడాకారులు సరదాగా చెప్పిన విషయాలు స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపడం ఇదే మొదటిసారి కాదు. ఐదేళ్ల క్రితం 'యూరో 2020' టోర్నమెంట్ సందర్భంగా ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ఉద్దేశపూర్వంగా కోకాకోలా కంపెనీ బాటిళ్లను పక్కన పెట్టేశాడు. దాంతో.. ఆ కంపెనీ షేర్లు 4 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.



## రెండుసార్లు 700

### తొలి ప్లేయర్‌గా దేవ్‌దత్ పడిక్కల్

విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ పరుగుల వరద పారిస్తున్నాడు. వరుస శతకాలతో విరుచుకుపడుతున్న అతడు.. సోమవారం ముంబయితో జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో రాణించాడు. ఈ మ్యాచ్‌లో పడిక్కల్ (81లి; 95 బంతుల్లో 11 ఫోర్లు) భారీ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ క్రమంలోనే ప్రస్తుత సీజన్‌లో 721 పరుగులతో నిలిచాడు. దీంతో ఈ పాతికేళ్ల కుర్రాడు ఓ అద్భుతమైన రికార్డు సొంతం చేసుకున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో రెండుసార్లు 700కుపైగా రన్స్ చేసిన తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. పడిక్కల్ 2020-21 సీజన్‌లోనూ 7 మ్యాచ్‌ల్లో 737 పరుగులు చేశాడు.



## ధవన్ ఎంగేజ్‌మెంట్

టీమిండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ శుభవార్త చెప్పాడు. ప్రియురాలు సోఫీ షైన్‌తో వివాహ నిశ్చితార్థం చేసుకున్నట్లు తెలిపాడు. 'చిరునవ్వుల నుంచి కలల దాకా అన్నీ పంచుకున్నాం. ప్రేమ మమ్మల్ని దీవించింది. చిరకాల ప్రయాణానికి నాందిగా మేము ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాము' అని శిఖర్- సోఫీ పేరిట సోషల్ మీడియా వేదికగా నోట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా బాల్కనీలో ఎర్ర గులాబీలతో అందంగా అలంకరించిన హృదయాకారం ముందుకు శిఖర్ చేయి చాచగా.. సోఫీ తన వజ్రపు ఉంగరాన్ని చూపిస్తూ అతడి చేతి మీద చేయి వేసిన ఫొటోను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది. కాబోయే వధూవరులు శిఖర్ ధావన్- సోఫీ షైన్‌లకు అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కాగా ఫిబ్రవరి మూడోవారంలో వీరి పెళ్లి వేడుక ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కాగా టీమిండియా ఓపెనర్‌గా సత్తా చాటిన శిఖర్ ధావన్ గతంలో.. ఆస్ట్రేలియాకు చెందిన ఆయేషా ముఖర్జీ అనే డివోర్సీని 2011లో పెళ్లి చేసుకున్నాడు. అన్యోన్యంగా కనిపించిన ఈ జంటకు కుమారుడు జొరావర్ ధావన్ సంతానం. అంతకుముందు పెళ్లి ద్వారా ఆయేషాకు ఇద్దరు కుమార్తెలు ఉండగా.. ధావన్ వాళ్లు కూడా తన సొంత కూతుళ్లలాంటి వారే అని పలు సందర్భాల్లో చెప్పాడు. అయితే, కొన్నాళ్లకు శిఖర్- ఆయేషా మధ్య విభేదాలు తలెత్తి తీవ్రరూపం దాల్చాయి. ఈ క్రమంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా 2023లో వీరికి విడాకులు మంజూరయ్యాయి. కొడుకు కూడా ధావన్‌కు దూరమయ్యాడు. దీంతో కొన్నాళ్లపాటు ఒంటరిగానే ఉన్న ధావన్.. కొంతకాలం క్రితం ఐర్లాండ్ భామ సోఫీ షైన్‌తో ప్రేమలో పడ్డాడు. ఇప్పుడు తమ ప్రేమను పెళ్లిదాకా తీసుకువచ్చేందుకు సిద్ధపడ్డారు ఈ జంట. కాగా సోఫీ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేట్ అని సమాచారం. అబుదాబిలోని ఓ కంపెనీకి ఆమె వైస్ ప్రెసిడెంట్ అని తెలుస్తోంది.

## సెమీస్‌లో కర్ణాటక, సౌరాష్ట్ర

### ఓడిన ముంబై, యూపీ


ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక, సౌరాష్ట్ర సెమీఫైనల్ చేరాయి. సోమవారం జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో కర్ణాటక విజేడీ పద్ధతిన 55 పరుగుల తేడాతో ముంబైని చిత్తు చేయగా.. సౌరాష్ట్ర కూడా విజేడీ పద్ధతిన 17 పరుగులతో యూపీని ఓడించింది. బెంగళూరులోని సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)లో జరిగిన మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించగా.. ఫలితాన్ని వీజేడీ పద్ధతిన తేల్చారు.



ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 254 పరుగులు చేసింది. షామ్స్ ములానీ(91 బంతుల్లో 8 ఫోర్లతో 86) రాణించగా.. సిద్దేష్ లాడ్(38) పర్వాలేదనిపించాడు. కర్ణాటక బౌలర్లలో విద్వాత్ కావేరప్ప(2/43), అభిలాష్ శెట్టి(2/59) రెండేసి వికెట్లు తీయగా.. విద్యధార్ పాటిల్(3/42) మూడు వికెట్లు పడగొట్టాడు. విజయ్‌కుమార్ వైశాఖ్(1/59) ఒక వికెట్ తీసాడు. అనంతరం కర్ణాటక మ్యాచ్ ఆగిపోయే సమయానికి 33 ఓవర్లలో వికెట్ నష్టానికి 187 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(95 బంతుల్లో 11 ఫోర్లతో 81 నాటౌట్), కరుణ్ నాయర్(80 బంతుల్లో 11 ఫోర్లతో 74 నాటౌట్)అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు. సీఓఈ-2 మైదానంలో జరిగిన రెండో మ్యాచ్‌లో యూపీ ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూపీ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 310 పరుగుల భారీ స్కోర్ చేసింది. అభిషేక్ గోస్వామి(82 బంతుల్లో 12 ఫోర్లతో 88), సమీర్ రిజ్వీ(77 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 88 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. రింకూ సింగ్(13) తీవ్రంగా నిరాశపర్చాడు. సౌరాష్ట్ర బౌలర్లలో చేతన్ సకారియా(3/54) మూడు వికెట్లు తీయగా.. అంకుర్ పన్వార్, ప్రేరక్ మన్కడ్ రెండేసి వికెట్లు తీయగా.. పర్సవరాజ్ రాణా ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం సౌరాష్ట్ర వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి 40.1 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగులు చేసింది. హార్విక్ దేశాయ్(116 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 100 నాటౌట్) అజేయ శతకంతో రాణించగా.. చిరాగ్ జానీ(40 నాటౌట్) వేగంగా ఆడాడు. యూపీ బౌలర్లలో కరణ్ చౌదరి, ప్రశాంత్ వీర్, విప్రజ్ నిగమ్ తలో వికెట్ తీసారు. మూడో,నాలుగో క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు మంగళవారం బెంగళూరులోని సీఓఈ వేదికగానే జరగనున్నాయి.

## ఐ డోంట్ కేర్

బెలారస్ టెన్నిస్ స్టార్ అరియానా సబలెంకా కొత్త ఏడాదిని, కొత్త సీజన్‌ను టైటిల్‌తో ప్రారంభించింది. బ్రిస్బేన్ ఓపెన్ డబ్ల్యూటీఏ--500 టోర్నీలో టాప్ సీడ్ సబలెంకా.. మార్టా కొస్ట్యుక్‌పై ఏకపక్ష విజయం సాధించింది. అయితే, మ్యాచ్ అనంతరం సబలెంకాతో కరచాలనం చేసేందుకు ఉక్రెయిన్‌కు చెందిన మార్టా నిరాకరించింది. ఉక్రెయిన్‌లో పరిస్థితుల నేపథ్యంలో రష్యా, బెలారస్ ప్లేయర్లతో షేక్‌హ్యాండ్‌కు దూరంగా ఉండాలని తాను పెట్టుకున్న నియమాన్ని ఇక్కడ కూడా 23 ఏళ్ల మార్టా పాటించింది. ఈ విషయంపై సబలెంకా తాజాగా స్పందించింది. 'అది ఆమె నిర్ణయం. అందుకు నేనేం చేయగలను?.. ఆమె షేక్‌హ్యాండ్ ఇచ్చినా.. ఇవ్వకపోయినా నాకేమీ తేడా ఉండదు. నేనసలు ఆ విషయాన్నే పట్టించుకోను. ఒక్కసారి కోర్టులో దిగిన తర్వాత నా ధ్యాసంతా ఆట మీదే ఉంటుంది. కోర్టులో అడుగుపెట్టిన తర్వాత గెలవాలన్న లక్ష్యంతోనే ముందుకు సాగుతాను. మర్టా లేదంటే జెస్సికా పెగులా.. నా ప్రత్యర్థిగా వీరిలో ఎవరు ఉన్నారన్నది ముఖ్యం కాదు. నా అత్యుత్తమ ప్రదర్శనతో విజేతగా నిలవడం.. ట్రోఫీని అందుకోవడంపై మాత్రమే దృష్టి సారిస్తా. నేను కొత్తగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదు. అథ్లెట్‌గా నా పనిని నేను సక్రమంగా పూర్తి చేస్తాను' అని సబలెంకా.. మార్టాకు పరోక్షంగా గట్టిగానే కౌంటర్ ఇచ్చింది. కాగా 2022 నుంచి రష్యా, బెలారస్ ప్లేయర్లతో షేక్‌హ్యాండ్‌కు మార్టా దూరంగా ఉంటోంది.



## ఐసీసీ మాకేం చెప్పలేదు

### బంగ్లా మ్యాచ్‌లపై బీసీసీఐ వివరణ




పొట్టి ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ భారత్, బంగ్లాదేశ్ బోర్డుల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడడం లేదు. 'ప్రపంచకప్ మ్యాచ్‌ల కోసం మా జట్టును ఇండియా పంపించమ'ని ఐసీసీకి బంగ్లా బోర్డు లేఖ రాయడంతో మొదలైన సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది. ఐసీసీ జోక్యం చేసుకుంటుందా? లేదంటే శ్రీలంకలో బంగ్లా జట్టు మ్యాచ్‌లు ఆడిపిస్తారా? అనేది తెలియడం లేదు.ఈ నేపథ్యంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా కీలక వ్యాఖ్యలు చేశాడు. తమకు ఐసీసీ నుంచి ఎలాంటి సమాచారం అందలేదని అన్నాడు. టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ జట్టు మ్యాచ్‌ల వేదికల మార్పు గురించి ఐసీసీ నుంచి మాకు ఇప్పటివరకూ ఎలాంటి సమాచారం అందలేదు.

## పాక్ క్రికెటర్ రిజ్వాన్‌కు చేదు అనుభవం



బిగ్‌బాష్ లీగ్‌లో పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ మహమ్మద్ రిజ్వాన్‌కు ఘోర అవమానం ఎదురైంది. అతని జిడ్డు బ్యాటింగ్‌కు తట్టుకోలేకపోయిన టీమ్‌మేనేజ్‌మెంట్ రిటైర్డ్ ఔట్‌గా వెనక్కిరప్పించింది. దాంతో బిగ్ బాష్ లీగ్ చరిత్రలోనే రిటైర్డ్ ఔట్ అయిన తొలి ఓవర్‌సీస్ ప్లేయర్‌గా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. మెల్‌బోర్న్ రెనిగెడ్స్, సిడ్నీ థండర్ మధ్య సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ లీగ్‌లో మెల్‌బోర్న్ రెనిగెడ్స్‌కు ప్రాతనిథ్యం వహిస్తున్న రిజ్వాన్.. 23 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 26 పరుగులే చేశాడు. వేగంగా ఆడేందుకు ఇబ్బంది పడుతుండటంతో రిటైర్డ్ ఔట్‌గా వెనక్కి వచ్చేయాలని టీమ్‌మేనేజ్‌మెంట్ సూచించింది. దాంతో రిజ్వాన్ నిరాశగా పెవిలియన్ చేరాడు.

## మాంటీ పనేసర్ రెండో పెళ్లి



ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ రెండో పెళ్లి చేసుకున్నాడు. 43 ఏళ్లున్న పనేసర్ ఈమధ్యే సుబ్రినా జోహల్‌ను మనువాడాడు. తమ వివాహ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్నాడు. మై మిస్సింగ్ పీస్ అని క్యాప్షన్ పెట్టాడీ వెటరన్. ఆమె పోస్ట్ అలా జరిగిపోయింది. కొత్త అధ్యాయం ప్రారంభించబోతున్నాం అని కామెంట్ రాసింది. దాంతో, కొత్త జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లండ్ విజయాల్లో కీలకమైన పనేసర్ మొదటి భార్య పేరు గురుశరన్ రత్తాన్. 31 ఏళ్ల వయసులో ఆమె నుంచి ఈ దిగ్గజ స్పిన్నర్ విడాకులు తీసుకున్నాడు.

## సుందర్ ఔట్.. ఆయుష్ బదోని



టీమిండియా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్.. న్యూజిలాండ్‌తో వడోదరలో జరిగిన తొలి వన్డేలో గాయపడ్డ విషయం తెలిసిందే. అతని పక్కటెముకల్లో తీవ్ర గాయమైంది. ఈ నేపథ్యంలో కివీస్‌తో జరిగే వన్డే సిరీస్ నుంచి అతన్ని తప్పించారు. రెండు జట్ల మధ్య మరో రెండు వన్డేలు జరగాల్సి ఉన్నది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 5 ఓవర్లు వేసి 27 రన్స్ ఇచ్చిన సుందర్ .. గాయం వల్ల మళ్లీ ఫీల్డింగ్ చేయలేదు. అయితే బ్యాటింగ్ కోసం మాత్రం అతను 8వ నెంబర్‌లో ఎంట్రీ ఇచచాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 13-1-2026






# బర్నౌట్.. కావాలి డిస్ కనెక్ట్!

డిజిటల్ యుగంలో మన ఉత్పాదకతను విప్లవాత్మకంగా పెంచిన సాధనాలే..స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, తక్షణ సమాచార వ్యవస్థలు. ఈరోజు మనకు తెలియకుండానే 24/7 పని చేయించుకునే మౌన అధిపతులుగా మారాయి. ఇవి వృత్తి జీవితం, వ్యక్తిగత శ్రేయస్సు మధ్య ఉండాల్సిన సున్నితమైన గీతను చెరిపివేస్తున్నాయి. సాయంత్రాలు, వారాంతాలు, సెలవులు కూడా పనిదినాల పొడిగింపులుగా మారుతున్నాయి. నిరంతరం అందుబాటులో ఉండడాన్ని అంకితభావంగా ముద్రవేయడం ఒక ప్రమాదకరమైన అపోహ. అది నెమ్మదిగా వ్యాపిస్తున్న వ్యాధి. ఆ వ్యాధి లక్షణాలు భారత కార్మిక లోక ముఖచిత్రంపైనే స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో భారతదేశం తన పౌరులకు ఒక మౌలిక హక్కును చట్టబద్ధంగా కల్పించాల్సిన అవసరం ఉంది.. అదే డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కు. ఇది కేవలం ప్రగతిశీల కార్మిక సంస్కరణ మాత్రమే కాదు; ఇది ప్రజారోగ్యం, దీర్ఘకాలిక ఆర్థిక ఉత్పాదకత, సామాజిక స్థిరత్వానికి సంబంధించిన జాతీయ కర్తవ్యం. మన అత్యంత విలువైన సంపద అయిన మన ప్రజలు నిశ్శబ్దంగా అలసటకు లోనవుతూ కుంగిపోతుంటే, భారతదేశం గ్లోబల్ శక్తిగా ఎదగడం అసాధ్యం. అంతర్జాతీయ కార్మిక సంస్థ గణాంకాలు భయంకరమైన వాస్తవాన్ని బయటపెడుతున్నాయి. భారతదేశ కార్మికుల్లో 51% మంది వారానికి 49 గంటలకు మించి పని చేస్తున్నారు. దీని వల్ల ప్రపంచంలోనే అత్యధిక పని గంటల దేశాల్లో భారత్ 2వ స్థానంలో నిలిచింది. ఇది అస్సలు నిలకడైన పరిస్థితి కాదు. ఈ నిరంతర పనిభారం ఫలితంగా భారతదేశంలో 78% ఉద్యోగులు ఉద్యోగ సంబంధిత బర్నౌట్‌ను అనుభవిస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ 'ఎల్లప్పుడూ ఆన్' సంస్కృతి కేవలం అలసట భావనతో ఆగిపోదు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

సరైన పని–వ్యక్తిగత జీవన సమతుల్యత లేకపోవడం వల్ల రక్తపోటు, మధుమేహం, ఆందోళన, డిప్రెషన్ వంటి జీవనశైలి వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. ఇవి వ్యక్తిగత విషాదాలే కాదు; దేశ ఆరోగ్య వ్యవస్థపై భారంగా మారి, సంస్థల ఉత్పాదకతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. అలసిన ఉద్యోగి సృజనాత్మకత కోల్పోతాడు, తప్పిదాలకు లోనవుతాడు, చివరికి ఉత్పాదకత తగ్గుతుంది. పని నాణ్యతను కాకుండా పని వ్యవధినే కొలిచే ప్రస్తుత దృష్టికోణం పాతది, స్వీయనాశనానికి దారితీసేది. 2024 సంవత్సరంలో అధిక పనిభారం కారణంగా మరణించిన యువ ఈవై ఉద్యోగి అన్నా సెబాస్టియన్ పెరాయిల్ ఘటన భారత కార్మిక లోకానికి ఒక తీవ్రమైన హెచ్చరిక. జాతీయ మానసిక ఆరోగ్య సర్వే ప్రకారం, దేశంలో నమోదవుతున్న మానసిక ఆరోగ్య సమస్యల్లో 10%--12% వరకు పని సంబంధిత ఒత్తిడే ప్రధాన కారణం. ఈ నిశ్శబ్ద మహమ్మారిని నిర్లక్ష్యం చేయడం అంటే జాతి శ్రేయస్సును కావాలని పక్కన పెట్టడమే. భారతదేశంలోని ప్రస్తుత చట్టపరమైన వ్యవస్థ ఈ ఆధునిక డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు సరిపోవడం లేదు. ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ (2020) సంప్రదాయ వర్గాలకు పని గంటల పరిమితిని నిర్దేశించినప్పటికీ, కాంట్రాక్ట్, ఫ్రీలాన్స్, గిగ్ ఉద్యోగుల వంటి విస్తృత ఉద్యోగ వర్గాలకు సరైన రక్షణ కల్పించడం లేదు. రాత్రి ఆలస్యంగా వచ్చిన సమాచారానికి స్పందించకపోతే ఉద్యోగ భద్రత కోల్పోతామన్న భయం ఉద్యోగుల్లో నెలకొంది. ఈ పరిస్థితిలో యజమాని--ఉద్యోగి మధ్య అధికార సమతుల్యత పూర్తిగా యజమాని వైపే ఒరిగిపోయింది. ఈ లోపాన్ని సరిదిద్దేందుకే డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కును చట్టబద్ధం చేసే ప్రతిపాదన అత్యవసరంగా మారింది. కేరళ వంటి రాష్ట్రాలు ఇప్పటికే స్థానిక ప్రైవేట్ రంగానికి వర్తించే చట్టాలను ప్రవేశపెట్టడం ఈ అవసరాన్ని నిర్ధారిస్తోంది. అయితే 'ఎల్లప్పుడూ ఆన్' సంక్షోభం దేశవ్యాప్తంగా ఉన్నందున, రాష్ట్రాల వారీగా కాకుండా కేంద్ర స్థాయిలో ఒకే విధమైన చట్టసవరణ అవసరం.

ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ (2020)లో సవరణ ద్వారా డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కును అన్ని రాష్ట్రాల్లో మౌలిక హక్కుగా స్థాపించాల్సిన అవసరం ఉంది. ఈ సవరణ ద్వారా కాంట్రాక్ట్, గిగ్ ఉద్యోగుల వంటి బలహీన వర్గాలకు కూడా రక్షణ విస్తరించబడుతుంది. ఈ హక్కును వృత్తి భద్రతలో ఒక కీలక స్తంభంగా గుర్తించడం ద్వారా మానసిక ఆరోగ్యానికి కూడా చట్టపరమైన గౌరవం లభిస్తుంది. అయితే చట్టం మాత్రమే సరిపోదు. సంస్థాగత సంస్కృతి కూడా మారాలి. పనితీరును కాకుండా కార్యాలయంలో ఎక్కువసేపు కనిపించడాన్నే విలువగా చూసే 'ప్రెజెంటీయిజం', అర్ధరాత్రి సమాచారాన్ని అంకితభావానికి సూచికగా భావించే ధోరణి వంటి విషపూరిత అలవాట్లను నిర్మూలించాలి. ఉద్యోగులు--యాజమాన్యానికి అవగాహన కార్యక్రమాలు, సున్నితత్వ శిక్షణలు తప్పనిసరి కావాలి. కౌన్సెలింగ్, మానసిక సహాయం వంటి ముందస్తు మానసిక ఆరోగ్య సేవలు కొత్త పని సంస్కృతిలో భాగంగా మారాలి. డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కు పని పట్ల నిర్లక్ష్యాన్ని ప్రోత్సహించేది కాదు. ఇది బాధ్యతాయుతమైన, గౌరవప్రదమైన పని సంస్కృతికి పునాది. విశ్రాంతి పొందిన మనస్సులు మరింత పదునైనవి, సృజనాత్మకమైనవి, దీర్ఘకాలంలో మరింత నిబద్ధత కలిగినవని ప్రపంచ అనుభవం స్పష్టం చేస్తోంది. ఇది పని గంటలను తగ్గించడం కాదు; పని చేసే గంటల నాణ్యతను పెంచడం. పని--వ్యక్తిగత జీవన సమతుల్యత కోసం చట్టపరమైన రక్షణలు, డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కు, పని గంటల పరిమితి – ఆల్ ఇవన్నీ కలిసి భారతదేశంలో ఆరోగ్యవంతమైన, స్థిరమైన, అధిక ఉత్పాదకత కలిగిన పని వాతావరణాన్ని నిర్మిస్తాయి. ఇది యువ జనాభా కలిగిన ప్రజాసంఖ్యా లాభాన్ని నిజమైన జాతీయ బలంగా మార్చుతుంది. మన ముందు ఉన్న ఎంపిక స్పష్టంగా ఉంది. ఒకవైపు బర్నౌట్ దారిలోనే సాగుతూ మన యువత ఆరోగ్యం, సామర్థ్యాన్ని ప్రమాదంలో పడేయడం. మరోవైపు ఈ సంస్కరణను స్వీకరించి, భారత ఆర్థిక వ్యవస్థ కేవలం వేగంపైనే కాదు, ప్రజల బలం, స్థిరత్వంపైనే నిర్మితమై ఉందని నిరూపించడం. భారతదేశ భవిష్యత్తు అలసిపోయిన చేతుల మీద కాదు, ఆరోగ్యవంతమైన మనస్సుల మీదే నిర్మించబడాలి. డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కు అదే దిశగా వేసే అత్యవసర అడుగు. డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కు గురించి జరుగుతున్న ఈ చర్చ చివరికి ఒక మౌలిక ప్రశ్నకు తీసుకువెళుతుంది. మనం ఏ రకమైన దేశంగా ఎదగాలనుకుంటున్నాం? నిరంతరం అలసిపోయిన కార్మికులపై ఆధారపడి పరుగులు తీసే ఆర్థిక వ్యవస్థగా ఉండాలా, లేక ఆరోగ్యవంతమైన, ఆలోచించే, సృజనాత్మకమైన ప్రజలపై నిలబడే స్థిరమైన దేశంగా మారాలా? ఈ ప్రశ్నకు ఇచ్చే సమాధానమే భారతదేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

డిజిటల్ యుగంలో పని అనే భావన పూర్తిగా మారిపోయింది. కానీ ఆ మార్పుకు తగినట్లుగా మన ఆలోచనలు, విధానాలు ఇంకా మారలేదు. పని గంటలు పెంచడమే అభివృద్ధి అన్న అపోహ ఇప్పటికీ కొనసాగుతోంది. వాస్తవానికి, పని గంటలు పెరిగే కొద్దీ ఉత్పాదకత తగ్గుతుందన్నది ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైన సత్యం. అలసిపోయిన మనస్సులు కొత్త ఆలోచనలు పుట్టించలేవు. ఒత్తిడితో నలిగిపోయిన ఉద్యోగులు దీర్ఘకాలంలో ఏ సంస్థకూ ఆస్తి కాలేరు. డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కు ఈ అపోహను సవాల్ చేస్తుంది. ఇది "ఎక్కువ పని"కు బదులుగా "మంచి పని"ని ప్రోత్సహిస్తుంది. ఇది సమయాన్ని కాకుండా నాణ్యతను కేంద్రబిందువుగా ఉంచుతుంది. ఇది ఉద్యోగిని ఒక యంత్ర భాగంగా కాకుండా, ఒక సంపూర్ణ మనిషిగా గుర్తిస్తుంది. ఈ హక్కు అమలులోకి రావడం వల్ల ఉద్యోగి జీవితంలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. పని ముగిసిన తర్వాత కుటుంబంతో గడిపే సమయం పెరుగుతుంది. వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి పెట్టే అవకాశం కలుగుతుంది. చదువు, కళలు, క్రీడలు, సమాజ సేవ వంటి అంశాలకు స్థానం లభిస్తుంది. ఇవన్నీ కలిసి ఒక సమతుల్యమైన, బాధ్యతాయుతమైన పౌరుణ్ణి తయారుచేస్తాయి. ఇది కేవలం వ్యక్తిగత ప్రయోజనాల విషయమే కాదు. సమాజంగా చూస్తే దీని ప్రభావం మరింత లోతైనది. మానసిక ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి. వైద్య వ్యవస్థపై ఒత్తిడి తగ్గుతుంది. కుటుంబ బంధాలు బలపడతాయి. పిల్లలపై తల్లిదండ్రుల దృష్టి పెరుగుతుంది. సామాజిక అస్థిరతకు కారణమయ్యే అనేక సమస్యలు నెమ్మదిగా తగ్గుముఖం పడతాయి. ఆర్థిక కోణంలో చూసినా ఈ సంస్కరణ భయపడాల్సినది కాదు. విశ్రాంతి పొందిన ఉద్యోగులు తప్పిదాలు తక్కువ చేస్తారు. నిర్ణయాలు స్పష్టంగా తీసుకుంటారు. సృజనాత్మక పరిష్కారాలు అందిస్తారు. దీని వల్ల సంస్థల పనితీరు మెరుగవుతుంది. దీర్ఘకాలంలో ఇది ఉత్పాదకతను పెంచుతుంది, తగ్గించదు. భారతదేశానికి ఇది మరింత కీలకం. ఎందుకంటే మన దేశానికి ఉన్న అతిపెద్ద బలం యువ జనాభా. అదే యువత నిరంతర ఒత్తిడితో మానసిక, శారీరక సమస్యలకు లోనైతే, ప్రజాసంఖ్యా లాభం భారంగా మారుతుంది. డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కు ఆ ప్రమాదాన్ని నివారించే రక్షణ కవచం. ఈ హక్కు మహిళలకు, ముఖ్యంగా పని చేసే తల్లులకు, ఒక కొత్త భరోసా ఇస్తుంది. పని--వ్యక్తిగత జీవన సమతుల్యత లేకపోవడం వల్ల ఉద్యోగాలను వదిలేయాల్సి వస్తున్న అనేక మంది మహిళలకు ఇది నిలకడైన ఉపాధికి మార్గం చూపుతుంది. ఇది లింగ సమానత్వానికి కూడా ఒక కీలక అడుగు.

గిగ్ ఎకానమీ, కాంట్రాక్ట్ ఉపాధి విస్తరిస్తున్న ఈ కాలంలో, ఈ వర్గాలకు చట్టపరమైన రక్షణ కల్పించడం సామాజిక న్యాయానికి తప్పనిసరి. డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కు ఈ కార్మికులను అగోచర దోపిడీ నుంచి బయటకు తీసుకువస్తుంది. అయితే ఈ మార్పు ఒక్క చట్టంతోనే సాధ్యం కాదు. ప్రభుత్వంతో పాటు సంస్థలు, యాజమాన్యం, ఉద్యోగులు---అందరూ కలిసి బాధ్యత వహించాలి. చట్టాన్ని కేవలం నిబంధనగా కాకుండా, ఒక విలువగా స్వీకరించాలి. మేనేజ్మెంట్ స్థాయిలో మొదలయ్యే మార్పే నిజమైన సంస్కృతి మార్పుకు దారి తీస్తుంది. విద్యా వ్యవస్థలో కూడా పని--జీవిత సమతుల్యత విలువలను చేర్చాలి. రేపటి ఉద్యోగులు ఈ విలువలతోనే పని ప్రపంచంలోకి అడుగుపెట్టాలి. అప్పుడే ఈ సంస్కరణ శాశ్వతంగా నిలుస్తుంది. ప్రపంచం ఇప్పటికే ఈ దిశగా ముందుకు సాగుతోంది. ఫ్రాన్స్, పోర్చుగల్, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఈ హక్కును గుర్తించాయి. భారత్ వెనుకబడాల్సిన అవసరం లేదు. భారతదేశం తనదైన మార్గంలో, తన సామాజిక వాస్తవాలకు తగిన విధంగా, ఈ హక్కును అమలు చేయగల సామర్థ్యం కలిగి ఉంది. చివరికి ఇది ఒక నైతిక ప్రశ్న కూడా. మనుషులను ఖర్చు చేసి అభివృద్ధి సాధించాలా, లేక మనుషులను గౌరవిస్తూ అభివృద్ధి సాధించాలా? డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కు ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇస్తుంది. భారతదేశ భవిష్యత్తు వేగంలో మాత్రమే కాదు, వివేకంలో ఉంది. సంఖ్యలతో మాత్రమే కాదు, మనుషుల జీవితాలతో కొలవబడాలి. అలసిపోయిన చేతుల మీద కాదు, ఆరోగ్యవంతమైన మనస్సుల మీద దేశ నిర్మాణం జరగాలి. డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కు ఒక చట్టం మాత్రమే కాదు. అది ఒక దృక్పథం. అది ఒక సామాజిక ఒప్పందం. అది భారతదేశం తన ప్రజల పట్ల చూపించే గౌరవానికి ప్రతీక. ఇప్పుడు మన ముందున్న ఎంపిక స్పష్టంగా ఉంది. ఈ సంస్కరణను ఆలస్యం చేసి బర్నౌట్ దారిలోనే కొనసాగాలా, లేక ధైర్యంగా ముందడుగు వేసి భారత కార్మిక లోకానికి ఒక కొత్త, మానవీయ దిశ చూపాలా? భవిష్యత్తు తరాలు మన నిర్ణయాన్ని ప్రశ్నిస్తాయి. వారికి గర్వపడే సమాధానం ఇవ్వాలంటే, ఈ రోజు మనం డిస్కనెక్ట్ అవ్వడానికి హక్కును చట్టంగా, ఆచరణగా మార్చాల్సిందే.

# పన్నులను సంస్కరించాలి




గౌరవనీయులైన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి గారికి,

వచ్చే బడ్జెట్‌లో జీతాలు పొందే ఉద్యోగులు, పెన్షనర్లు మరియు సీనియర్ సిటిజన్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కింది సూచనలను సమర్పిస్తున్నాను.

1. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంపు: 2014లో నిర్ణయించిన రూ.3 లక్షల ప్రాథమిక మినహాయింపు పరిమితిని, ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితులకు అనుగుణంగా రూ.6 లక్షలకు పెంచాలి. దీనివల్ల మధ్యతరగతి వర్గాలకు భారీ ఊరట లభిస్తుంది.

2. నూతన పన్ను విధానంలో మార్పులు: ప్రస్తుత న్యూ టాక్స్ రిజీమ్‌లో ఉన్న తక్కువ పన్ను రేట్లను కొనసాగిస్తూనే, పాత విధానంలో ఉన్న సెక్షన్ 80సీ, 80డీ వంటి పొదుపు మినహాయింపులను అనుమతించాలి. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు అయోమయం లేకుండా ఒకే సరళమైన పన్ను విధానాన్ని అమలు చేయాలి.

3. బ్యాంకు డిపాజిట్లపై ద్రవ్యోల్బణ అలవెన్స్: సీనియర్ సిటిజన్లు తమ జీవనోపాధి కోసం బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆధారపడతారు. పెరుగుతున్న ధరల దృష్ట్యా, వారి డిపాజిట్ మెచ్యూరిటీ సమయంలో అసలు మరియు వడ్డీతో పాటు, ఆ కాల వ్యవధికి సంబంధించిన ద్రవ్యోల్బణ అలవెన్స్‌ను అదనంగా చెల్లించాలి. దీనివల్ల వారి పొదుపు విలువ తగ్గకుండా ఉంటుంది.

ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, సామాన్యులకు, వృద్ధులకు ఆర్థిక భరోసా కల్పిస్తారని ఆశిస్తున్నాను.

**ధన్యవాదాలతో..**

**కే లక్ష్మణ రావు, ఇండియన్ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి, బెంగళూరు**



రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.